RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 254 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 అక్టోబర్ 2024 శనివారం పేజీలు : 4

## రైల్వే ఉద్యోగులకు బోనస్ బొనాంజా

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల పండుగ బోన్‌సను ప్రకటించారు. 11.71 లక్షల మంది రైల్వే సిబ్బందికి రూ.2028.57 కోట్లను ఉత్పాదక అనుసంధానిత బోన్‌సగా చెల్లించనున్నారు. వీటితో పాటు చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండో దశ మూడు కారిడార్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. 118.9 కిలోమీటర్ల మార్గంలో 128 స్టేషన్లతో కూడిన ఈ కారిడార్లలో.. మాధవరం–సిపకాట్ (45.8 కి.మీ. 50 స్టేషన్లు), లైట్ హౌస్–పూనమల్లి బైపాస్ (26.1 కిలోమీటర్లు–30 స్టేషన్లు), మాధవరం–షోలింగనల్లూర్ (47 కి.మీ.–48 స్టేషన్లు) ఉన్నాయి. రూ.63,246 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును 2027 నాటికి పూర్తిచేయాలనేది లక్ష్యం. ప్రధాన పోర్టులు, డాక్ లేబర్ బోర్డు ఉద్యోగుల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకంలో మార్పులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



# ఈ సీజన్ నుంచే బోనస్!

## ధాన్యం సేకరణపై దృష్టి పెట్టిన రేవంత్ సర్కార్!

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు శుభవార్త చెప్పింది. బోనస్ ఈ సీజన్ నుంచే ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఖరీఫ్ ధాన్యం సేకరణ ఏర్పాట్లపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ అనేక సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు కనీస మద్దతు ధరకు అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లోపే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పగా, అవసరమైన చోట కలెక్టర్లు అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రస్తుత సీజన్ లో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది అని సీఎం తెలిపారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు, తప్పులు జరగకుండా జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి. ప్రతి కేంద్రానికి ఒక నెంబర్ కేటాయించి, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నెంబర్ తప్పకుండా వేయాలి. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించరాదు అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, టార్పా లిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి. సమస్యల పరిష్కారానికి పౌర సరఫరాల శాఖ విభాగంలో 24X7 కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికేట్ల పరిశీలనను అక్టోబర్ 5 వ తేదీలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడానికి నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను మూడు రోజుల కిందట ముఖ్యమంత్రి విడుదల చేశారు. దసరా పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 9 వ తేదీన వారందరికీ ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను అందించాలని సీఎం ఇప్పటికే ఆదేశించారు. సచివాలయం లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన ముఖ్యమంత్రి నిర్ధేశించిన గడువులోగా సర్టిఫికేట్ల పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 9090 మంది అభ్యర్థుల సర్టిఫికేట్ల పరిశీలన పూర్తయిందని విద్యా శాఖ అధికారులు సీఎంకు వివరించారు.



## రుణమాఫీపై ముఖ్యమంత్రివన్నీ డొల్ల మాటలే..

హైదరాబాద్ : రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. వందశాతం పూర్తి చేస్తామని చెప్పిన మాటలన్నీ అబద్దాలే అంటూ వ్యాఖ్యలు చేశారు. రుణమాఫీపై మరోసారి ఎక్స్ వేదికగా కేటీఆర్ విరుచుకుపడ్డారు. రుణమాఫీపై వ్యవసాయ మంత్రి ప్రకటనతో బండారం బయటపడిందంటూ విరుచుకుపడ్డారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలన్నీ డొల్లమాటలే అని అన్నారు. అధికారికంగా 20 లక్షల మంది రైతులకు అన్యాయం జరిగితే అనధికారికంగా ఇంకెంతమంది రైతులు ఉన్నారో అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

**కేటీఆర్ ట్వీట్...** 20 లక్షల మందికి రుణమాఫీ కానే కాలేదన్న వ్యవసాయ మంత్రి ప్రకటనతో సీఎం బండారం మరోసారి బట్టబయలైందన్నారు. వందశాతం రుణమాఫీ పూర్తిచేశామని విర్రవీగిన ముఖ్యమంత్రివన్నీ డొల్లమాటలేనని ఇంకోసారి తేలిపోయిందని విమర్శించారు. ఓవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని దగా చేసి.. మరోవైపు 10 నెలలైనా 20 లక్షల మందికి మోసం చేశారన్నారు. 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారిక లెక్కల ప్రకారమే 20 లక్షల అన్నదాతలకు అన్యాయం జరిగితే అనధికారికంగా రుణమాఫీ కాని రైతులందరో అని అన్నారు. చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదని.. ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇయ్యలేదన్నారు. రాబంధుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభం రేవంత్ చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోలేని శాపం అంటూ కేటీఆర్ పోస్టు చేశారు.

## 6న ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డి




సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 6న ఢిల్లీకి వెళ్లనున్నారు. హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి, వరద నష్టం వివరాలను సమర్పించి, కేంద్రం ప్రకటించిన అతితక్కువ వరద సహాయంపై మరోసారి పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలు తీరని నష్టాలను మిగిల్చాయి. వరద నష్టాన్ని అంచనావేయడానికి రాష్ట్రంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రితోపాటు, కేంద్ర ప్రత్యేక బృందం పర్యటించింది. మరోవైపు ఏపీలో కూడా వర్షాలు, వరదల వలన భారీ నష్టాలు సంభవించాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు ఎన్డీఆర్ఎఫ్ వరద సాయం కింద కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా రూ. 1500 కోట్లు తక్షణ సాయం ప్రకటించారు. కానీ వాస్తవంగా తెలంగాణకు అతి తక్కువగా రూ. 421 కోట్లు మాత్రమే కేంద్రం నిధులు విడుదల చేసింది. తెలంగాణలో వరద నష్టం రూ.10 వేల కోట్లకు పైగా లెక్క తేలగా.. కేంద్రం మాత్రం అరకొర సహాయం ప్రకటించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఎల్లుండి ఢిల్లీ వెళ్ళి మరోసారి వివిధ శాఖల కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదల వలన కలిగిన నష్టాలను వివరించనున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఏడుగురు మావోయిస్టుల మృతి



దంతెవాడ: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మళ్లీ తుపాకుల మోత మోగింది. నారాయణ్‌పుర్– దంతెవాడ సరిహద్దుల్లో శుక్రవారం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎదురుకా ల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు వెల్లడిం చారు. బస్తర్ రేంజ్‌లోని దంతెవాడ, నారాయణ్‌పుర్ జిల్లాల సరిహ ద్దుల్లో ఉండే అబూజ్‌మడ్ దండకారణ్యంలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం అందింది. దీంతో భద్రతా సిబ్బంది ఈ ప్రాంతంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే మధ్యాహ్నం సమయంలో భద్రతా దళాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులకు దిగారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఘటనాస్థలంలో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అంతేగాక భారీ ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



## రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారు

మహబూబాబాద్: వరంగల్ డిక్లరేషన్ అమలు కోసం ఢిల్లీలోని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇంటిముందు ధర్నా చేస్తామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. దసరా తర్వాత ఢిల్లీకి వెళ్తామని చెప్పారు. తొర్రూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా జరిగింది. ఈ ధర్నాలో హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. రైతుల రుణమాఫీ చేసేవరకూ వదిలిపెట్టమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీ స్పందించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒకచేతిలో రాజ్యాంగం మరో చేతితో రౌడీయిజం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ది రైతు గుండె రేవంత్‌ది రాతిగుండె అని హరీష్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్దాల పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఆగష్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని అన్ని దేవుళ్లపై ఒట్టుపెట్టి మోసగాడిగా మారారని హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి మొనగాడు కాదు మోసగాడు అని విమర్శించారు. 31 కుంటి సాకులు చెప్పి రేవంత్ రుణమాఫీ ఎగ్గొడుతున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోమని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దసరాలోపు రైతుబంధు డబ్బులు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. హామీలు అమలు చేసే వరకూ రేవంత్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఒక్క బస్సు తప్ప రేవంత్ పాలన అంతా తుస్సేనని హరీష్‌రావు విమర్శించారు. రైతులు చనిపోయినా రేవంత్‌కు కనికరం లేదా అని ప్రశ్నించారు. ప్రజల నుంచి నిరసన వచ్చినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలని అన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రేవంత్ రెడ్డి గుండాగిరిచేస్తే బీఆర్ఎస్ నేతలు చూస్తూ ఊరుకోరని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. పాలకుర్తికి ఇద్దరు ఎమ్మెల్యేలట... అయినా అభివృద్ధి జరగడం లేదని హరీష్‌రావు విమర్శించారు.

## తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వివాదం..

# స్వతంత్ర సిట్

## ఏర్పాటుకు సుప్రీం ఆదేశం!



ఢిల్లీ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణల అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిలో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరఫున ఇద్దరు పోలీసు అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒక సీనియర్ అధికారి సభ్యులుగా ఉండాలని సూచించింది. స్వతంత్ర సిట్ దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని తెలిపింది. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు సుప్రీంకోర్టు పేర్కొంది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన అభిప్రాయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపారు. "మొత్తం అంశాన్ని పరిశీలించాను. ఇది భక్తుల మనోభావాలకు చెందిన విషయం. దర్యాప్తు కొనసాగాలని కోరుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వ సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవు. అయితే స్వతంత్ర విచారణ కోరుకుంటున్నారు కాబట్టి.. సీనియర్ కేంద్ర అధికారి పర్యవేక్షణ ఉంటే మరింత విశ్వాసం పెరుగుతుంది" అని చెప్పారు.

**వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డిపై ఆగ్రహం :** పిటిషనర్లలో ఒకరైన వైకాపా ఎంపీ, తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తనపై విజిలెన్స్ విచారణ అంశాన్ని దాచిపెట్టారు. విజిలెన్స్ విభాగం నుంచి వచ్చిన నోటీసులు.. దానిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని సుప్రీంకోర్టుకు ఆయన చెప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వైవీ సుబ్బారెడ్డి తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. భక్తుల మనోభావాలతో కూడిన వ్యవహారాన్ని రాజకీయంగా వాడుకోవద్దని సూచించింది. కోర్టులను రాజకీయ వేదికలుగా వినియోగించవద్దని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటుకు ధర్మాసనం విముఖత వ్యక్తం చేసింది. ఈ వివాదంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరిపించాలని కోరుతూ.. మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి, వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, విక్రమ్‌సంపత్ అనే భక్తుడు, సుదర్శన్ టీవీ ఎడిటర్ సురేష్ ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్నే (సిట్) కొనసాగించాలా? లేదంటే ప్రత్యేక స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలా అన్న అంశంపై కేంద్రం తరఫున అభిప్రాయం చెప్పాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. అనంతరం విచారణను గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు వాయిదా వేసింది. ఆ ప్రకారం 3.30కి ధర్మాసనం ముందు హాజరైన తుషార్ మెహతా.. తాను నాలుగో కోర్టులో మరో కేసు విచారణలో ఉన్నందున ఈ కేసు విచారణను శుక్రవారం ఉదయం 10.30కి తీసుకోవాలని ధర్మాసనానికి విన్నవించారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ బీఆర్ గవాయి.. కల్తీ నెయ్యి వివాదం కేసును శుక్రవారం మొదటి నంబర్ కింద విచారించడానికి అంగీకరిస్తూ వాయిదా వేశారు. నేడు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

# సంపాదకీయం

## ప్రధాని పీఠం వైపుగా గడ్కరీ అడుగులు ?

కేంద్రంలో కీలక మార్పులు సంభవి స్తాయా. పదేళ్లుగా తిరుగులేని రాజ్యం చేస్తున్న నరేంద్ర మోడీ వారసుడి నీడలా ఆయన వెంటనే ఉన్నారా. ఈ ప్రశ్నలను బదులు కాలమే చెబుతుంది అని అంటున్నారు. మోడీ వెంట ఉన్నది కేంద్రంలోనూ పార్టీలోనూ కీలకంగా ఉన్నది ఎవరో అందరికీ తెలుసు. ఆయనే అమిత్ షా. అయితే ఆయన కాకుండా మరో నాయకుడు నీడలాగానే ఉన్నారు. ఆయనే మహారాష్ట్రకు చెందిన నేత నితిన్ గడ్కరీ. ఆయన 2010 ప్రాంతంలోనే బీజేపీకి జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితం ఆయనది. కేంద్ర మంత్రిగా గత పదేళ్ళుగా కేంద్రంలో పనిచేస్తున్నారు. ఇదిలా ఉంటే 2024 ఎన్నికల తరువాత ఆయనకే ప్రధాని చాన్స్ దక్కుతుందని అంతా అంచనా వేశారు అని ప్రచారం సాగింది. కానీ మోడీ అమిత్ షా ద్వయం వేసిన ఎత్తులకు ఆయన చిత్తు అయ్యారని చెబుతారు. ఏపీ నుంచి చంద్రబాబు బీహార్ నుంచి నితీష్ కుమార్ మద్దతుని పొందడంతో మోడీ సాధించిన విజయం ఆయనకు మూడోసారి ప్రధాని పీఠాన్ని దక్కించింది అని అంటున్నారు. ఇదిలా ఉంటే గడ్కరీ ఇటీవల కాలంలో తన ఆలోచనలను బయట పెట్టుకుంటున్నారు. తనకు ప్రధాని చాన్స్ వచ్చినా విలువలకు కట్టుబడి నో చెప్పాను అని ప్రతిపక్షాలు తనకు సహకరిస్తామని చెప్పినా తాను రాజకీయ విలువలు కలిగిన నేతగా నో చెప్పాను అని కూడా తెలిపారు. ఇలా తరచుగా ప్రధాని పదవి మీద నితిన్ గడ్కరీ మాట్లాడడం ఎండీయే లోపలా బయటా చర్చగా మారింది. నితిన్ గడ్కరీ అంత నిబ్బరంగా ఈ మాటలు చెబుతున్నారు అంటే ఆయన వ్యూహం ఏమిటి వెనక ఎవరు ఉన్నారు అన్న చర్చ కూడా ఉంది. అయితే ఆయంకు నిండుగా ఆరెస్సెస్ దీవెనలు ఉన్నాయని అంటున్నారు. అందుకే ఆయన ఈ విధంగా ధాటీగా మాట్లాడుతున్నారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే నితిన్ గడ్కరీని తన పని తాను చేసుకోమని ఆరెస్సెస్ రోడ్ మ్యాప్ ఇచ్చింది అని కూడా ప్రచారం సాగుతోంది. బీజేపీలో వరిష్ట నేత ఎల్ కే అద్వానీ, అలాగే సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీలను పార్టీ నుండి దూరం పెట్టేందుకు 75 ఏళ్ల వయోపరిమితిని మోడీ ప్రధాని అయ్యాక తెచ్చారు. ఇపుడు అదే 75 ఏళ్ళ కాల పరిమితిని మోడీకే చూపించి ఆయనను తప్పుకోమని ఆరెస్సెస్ కోరే చాన్స్ ఉంది అని అంటున్నారు. 2025 సెప్టెంబర్ 17 నాటికి మోడీకి 75 ఏళ్ళు పూర్తిగా నిండిపోతాయి. దాంతో ఆయన ఆ తరువాత మాజీ ప్రధాని అవుతారా అన్న చర్చ కూడా సాగుతోంది దానికి దారి తీసే రాజకీయ పరిస్థితులు కూడా ఉంటాయని అంటున్నారు. అక్టోబర్ 8న కాశ్మీర్, హర్యానా అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఫలితాలు వస్తాయి. ఈ రెండు చోట్లా బీజేపీకి ఆశలు లేవు అని అంటున్నారు. ఆ తరువాత జారండ్, మహారాష్ట్రలలో కూడా బీజేపీకి ఓటమి తప్పదని చెబుతున్నారు. ఇక ఢిల్లీ, బీహార్ లలో కనుక బీజేపీ ఓటమి పాలు అయితే మోడీ గ్లామర్ పట్ల సొంత పార్టీలోనే డౌట్లు వస్తాయని, దానికి తోడు మిత్రులలోనూ ప్రతిపక్షాలలోనూ కూడా మోడీ టార్గెట్ అవుతారని అంటున్నారు ఆ విధంగా బీజేపీ లో మోడీకి వ్యతిరేకత మొదలైతే కనుక ఆల్టర్నేషన్ గా గడ్కరీని సిద్ధంగా ఆరెస్సెస్ ఉంచింది అని అంటున్నారు. బీజేపీ ఇపుడు గడ్కరీ తో పాటు యూపీ సీఎం యోగిని కూడా లైన్ లో పెట్టింది అని అంటున్నారు. మోడీ వల్ల బీజేపీ ఒక వెలుగు వెలిగింది. ఆయన ఇమేజ్ తగ్గిపోతున్న వేళ బీజేపీని కాపాడుకునే వ్యూహంలో భాగమే ఇదని అంటున్నారు. ఏది ఏమైనా మోడీకి రానున్న రోజులు రాజకీయంగా ఇబ్బందికరమే అవుతాయని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో ఎంత నిజం ఉందో.

# మురుగు పరుగు.. ఆరోగ్యం బేజారు




హైదరాబాద్: వానలు కురుస్తుండడం.. ఎక్కడపడితే అక్కడ మ్యాన్‌హోళ్లు పొంగుతూ మురుగు, వర్షపు నీరు రహదారులు, కాలనీలను ముంచెత్తడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది. ఇప్పటికే డెంగీ, మలేరియా, అతిసారం, చికెన్‌గన్యా లాంటి వ్యాధులతో జనం ఆసుపత్రుల బాట పడుతున్నారు. నీరు, మురుగులో పుట్టే దోమలు, ఈగలు ఇళ్లపై దాడులు చేస్తున్నాయి. కలుషిత తాగునీరు, బయట ఆహారం తీసుకోవడంతో వ్యాధుల తీవ్రత పెరుగుతోంది.

**వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ**

డాక్టర్ కృష్ణ స్వరూప్‌రెడ్డి, అపోలో క్రెడిల్ వైద్యుడు

డెంగీ: ఈ దోమ వరద నీటిలో పెరుగుతుంది. పగటిపూట కుడుతుంది. జ్వరం, కడుపులో నొప్పి, కళ్ల వెనుక భాగంలో నొప్పి, ఆకలి ఉండదు. వికారం, బలహీనత, చర్మంపై దద్దుర్లు వంటివి లక్షణాలు

నివారణ: పరిసరాల్లో నిలిచిన నీరు, మురుగును వెంటనే తొలగించాలి. దోమల మందులు వాడాలి. నీటి డ్రమ్ములపై మూతలు పెట్టాలి. పూలకుండీల్లో నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలి.

చికున్‌గన్యా: ఈ దోమ కాటుతో తీవ్రమైన కీళ్ల నొప్పులుంటాయి. జ్వరం, చలి కూడా తోడవుతుంది. తీవ్ర అలసట ఎదుర్కొంటారు.

నివారణ: నిల్వ నీటితో ఉన్న ఉపరితలాలు, కంటైనర్లు శుభ్రపరచాలి. మందులు పిచికారి చేయాలి.

అతిసారం: అపరిశుభ్రమైన ఆహారం, కలుషిత నీటితో అతిసారం వస్తుంది. కడుపులో తిమ్మిరి, నొప్పి, ఉబ్బరం, వికారం, వాంతులు, వీరేచనాలు, జ్వరం ఉంటాయి.

నివారణ: కాచి వడబోసిన నీటిని తాగాలి. వేడి భోజనం చేయాలి. ఎలక్ట్రోలైట్లు ఉండే కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రవాలు తీసుకోవాలి.

మలేరియా: మలేరియా దోమ మురుగు, నిల్వ నీటిలో పెరుగుతోంది. చలిజ్వరం ఉంటుంది. చెమటలు పడతాయి. తలనొప్పి, వికారం ఉంటాయి.

నివారణ: పరిసరాల్లో మురుగు, వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమల మందులు పిచికారి చేయాలి. పిల్లలకు కాళ్ళు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి.

టైపాయిడ్: ఎస్‌టైఫీ బ్యాక్టీరియాతో వస్తుంది. కలుషిత నీళ్లు, పరిశుభ్రత లేని ఆహారంతో వ్యాపిస్తోంది. అధిక జ్వరం, కడుపునొప్పి, మలబద్దకం, తలనొప్పి, వాంతులు, వికారం ఉంటాయి.

నివారణ: పరిశుభ్రమైన నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. వ్యక్తిగత శుభ్రత పాటించాలి. వ్యాక్సిన్ తీసుకోవాలి

కలరా: విబ్రియో బ్యాక్టీరియాతో సోకుతుంది. కలుషితమైన ఆహారం, నీటితో వస్తుంది. నీళ్ల విరేచనాలు, వాంతులు అవుతాయి. లోబీపీ, దాహం, కండరాల తిమ్మిరి, ఉంటుంది.

నివారణ: కాచి వడబోసిన చల్లార్చిన నీటిని తాగించాలి. బయట ఆహారం, నీళ్లకు దూరంగా ఉండాలి. పరిశుభ్రత పాటించాలి.

హెపటైటీస్ ఎ: మానవ వ్యర్థాలు, వ్యాధి సోకిన వ్యక్తి మూత్రంతో, కలుషితమైన ఆహారం, నీటితో సోకుతుంది. జ్వరం, బలహీనత, కడరాలు, కీళ్ల నొప్పులు

నివారణ: శుభ్రత పాటించాలి. వేడిగా ఆహారం, శుభ్రమైన నీటిని తాగాలి. ఇంటి చుట్టూ మురుగు లేకుండా చూసుకోవాలి.

**జలమండలి నెట్‌వర్క్ ఇలా..**

ప్రధాన, అంతర్గత మురుగు పైపులు 10 వేల.మీ, కలుషిత నీటిపై నెలకు వచ్చే ఫిర్యాదులు 35-39 వేలు

పాత తాగునీటి పైపులైను 2500 కిలోమీటర్లు

గ్రేటర్‌లో ఏటా వానాకాలంలో ఆయా వ్యాధుల బారిన పడేవారి సంఖ్య(సుమారుగా)

డెంగీ 2000 పైనే

మలేరియా 1500 1800చికెన్ గన్యా 800 900అతిసారం, వైరల్ గ్యాస్ట్రో ఎంటెరిటిస్ 6000 7000 (నెలకు)

హెపటైటిస్ ఎ- 400500 (నెలకు)

# టాస్క్ దరిచేరని చదువు



తాండూరు: జిల్లాలో డిగ్రీ పూర్తి చేసి బయటకు వస్తున్న వారికి ఉపాధి కల్పన ప్రశ్నార్థకంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. ఏటా తృతీయ సంవత్సరం పూర్తిచేస్తున్న వారు జిల్లా వ్యాప్తంగా 550 మంది ఉంటున్నారు. గతంలో ప్రవేశపెట్టిన తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) అమలు కావడంతో మొదట్లో మంచి ప్రయోజనం కలిగింది. ప్రస్తుతం టాస్క్ సవ్యంగా అమలు కావడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉపాధికి నైపుణ్యం పెంపుదలకు ప్రైవేటు సంస్థలపై ఆధారపడాల్సి వస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థులకు చిన్న,పెద్ద పరిశ్రమలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇందుకు ఐటీఐ, పాలిటెక్నిక్‌లు కీలకంగా మారుతున్నాయి.

**4,650 మంది పేర్ల నమోదు**

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో దశాబ్ద కాలం పైగా నమోదు వివరాలను పరిశీలిస్తే ఇప్పటి వరకు 4,650 మంది యువతీ, యువకులు ఉపాధి కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. అవగాహన ఉన్న నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్)లోనూ నమోదు చేసుకుంటున్నారు.

**వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వాలి**

అక్షిత, బీజెడ్‌సీ, డిగ్రీ ప్రథమ సంవత్సరం, తాండూరు

విద్యాభ్యాసం పూర్తి కాగానే ఉపాధి పొందాలనుకుంటున్నాం. ఇందుకోసం కళాశాలల్లో మూడు నుంచి ఆరు నెలలు లేదంటే ఏడాది కాల వ్యవధికి సంబంధించిన కోర్సులో శిక్షణ ఇవ్వాలి. ఉద్యోగం రాకపోయినా వృత్తి విద్యా నైపుణ్యంతో పరిశ్రమల్లో ఉపాధి పొందవచ్చు.

**జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ**

ఎస్.ఎ.సుభాన్, జిల్లా ఉపాధి కల్పనాధికారి

వృత్తి నైపుణ్యం విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎవరైనా ఉంటే జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం వికారాబాద్‌లోనూ స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతోంది. పేద విద్యార్థులకు ఎంతో మంచిది: రవి, బీఏ తృతీయ సంవత్సరం, తాండూరుడిగ్రీ విద్యా బోధనతో పాటు కళాశాలల్లో ఉపాధి అవసరాలకు సంబంధించిన శిక్షణ ఇస్తే పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడాల్సిన పని ఉండదు.

# హద్దులు మీరి.. సరిహద్దులు మార్చి

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాలోని చెరువులు, వాగుల్లో వెంచర్లు వేసుకునేందుకు నీటి పారుదల శాఖలో కొందరు అధికారులు రియల్ వెంచర్ల ప్రతినిధులకు సహకరించినట్లు సమాచారం. చెరువులు, వాగుల బఫర్‌జోన్లు, ఫుల్‌ట్యాంక్‌లెవల్ గుర్తులు మార్చినట్లు ప్రాథమిక ఆధారాలు లభించినట్టు తెలిసింది.


**కాసులిస్తే అభ్యంతరం లేదు..**

ముడుపులిస్తే చెరువులో వెంచర్ వేసినా అధికారులు నిరభ్యంతర పత్రాలు ఇచ్చినట్టు ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. వందకుపైగా చెరువుల రూపురేఖలు మార్చినట్టు తెలుసుకున్నారు.

సర్వే రికార్డుతో పరిశీలన..: చెరువుల్లో కబ్జాలు, బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్ మార్పులను అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులు రంగారెడ్డి జిల్లాలోని 1075 చెరువులను సర్వే చేస్తున్నారు. కొందరు అధికారులు 40శాతం ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్లు మార్చారన్న ఫిర్యాదులతో క్షేత్రస్థాయికి గ్రామ నక్షాలు, పహాణీ సర్వే రికార్డులను తీసుకెళ్తున్నారు. పాత రికార్డుల్లోనున్న విస్తీర్ణానికి, ప్రస్తుత ఉన్నదానికి పోల్చుతున్నారు. కబ్జా గుర్తిస్తే నిర్మాణదారులకు తాఖీదులు ఇచ్చి కట్టడాలు కూల్చేస్తున్నారు.

**ఆ నాలుగు ప్రాంతాల్లోనే ఎక్కువ**

చెరువులు అధికంగా ఉన్న శంషాబాద్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట్ మండలాల్లో విచ్చలవిడిగా బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌లు మార్చేశారు.



గండిపేట్ మండలం పీరంచెరువు, నెక్నాంపూర్ చెరువు, శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడతో సహా 12 చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు ఎన్‌వోసీలిచ్చారు. గండిపేట్ మండలంలో విల్లాలు నిర్మించేందుకు ఓ చెరువు బఫర్‌జోన్ పరిధి తగ్గించారు. కొత్వాల్‌గూడ, శంషాబాద్, బహదూర్‌గూడలో చెరువుల హద్దులు మార్చినట్టు సర్వేలో తేలగా.. భాద్యులకు మెమోలు ఇచ్చారు.

## మూడు చింతలపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న తాహాసిల్దార్ కార్యాలయ పనులను పరిశీలించిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం

శామీర్ పేట, (గరుడ వార్త) : తహాసీల్దార్ కార్యాలయంలో రికార్డులను సరైన విధంగా భద్రపరిచేలా స్టాంగ్ రూమ్ లను ఆధునీకరణ పద్ధతులతో నిర్మించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ మూడు చింతలపల్లి మండల తాహాసిల్దార్ వెంకట్ నరసింహారెడ్డికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రం మూడు చింతలపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న తాహాసిల్దార్ కార్యాలయ పనులను జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూనూతనంగా నిర్మిస్తున్న తహాసీల్దారు కార్యాలయంలో రికార్డులను సరైన విధంగా భద్రపరిచేలా స్టాంగ్ రూమ్ లను ఆధునీకరణ పద్ధతులతో భవనాన్ని నిర్మించి, నిర్మాణం ఒక ఉదాహరణగా ఉండేలా చూడాలని





చెప్పారు. అద్దెభవనంలో ఉంటున్న తహాసీల్దారు కార్యాలయానికి సొంత భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కంప్యూటర్ రూములు, సిబ్బందికి, కార్యాలయానికి వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఎన్నిరోజులలో నిర్మాణం పూర్తవుతుందని, ఇప్పటి వరకు ఎంత ఖర్చు ఐందని, ఎంత ఖర్చు అవుతుందని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాధవశాత్తు చెరువులో పడి ఈత రాక ముగ్గురు చిన్నారులు మృతి

శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రమాదవశాత్తు ముగ్గురు చిన్నారులు చెరువులో పడి ఈత రాకపోవడంతో మృతి చెందిన సంఘటన జీనోము వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు వివరాల ప్రకారం మూడు చింతలపల్లి మండలం కొల్తూరు గ్రామానికి చెందిన బాలేకర్ మణి హర్ష (14), సలేంద్రి హర్షవర్ధన్ (11), వీరబోయిన మనోజ్(10) లు దసరా పండుగ సెలవులు కావడంతో సరదాగా ఆడుకుంటూ చెరువుగట్టుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు





ముగ్గురు చిన్నారులు చెరులో పడి ఈత రాకపోవడంతో మృతి చెందారు. చిన్నారుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ముగ్గురు చిన్నారులు చెరువులో పడి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విజయ దుర్గమాత కు ప్రత్యేక పూజలు

తార్నాక : దేవి నవరాత్రులను పురస్కరించుకొని లాలాపేటలోని విజయ దుర్గమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం బిజెపి సీనియర్ నాయకులు చుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టి వేద పండితులతో పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు తీర్థప్రసాదులను అందజేశారు. ఈ సందర్భంగా చుక్క గణేష్ మాట్లాడుతూ దేవి నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు విజయ దుర్గ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ దుర్గ మాత టీం సభ్యులు, భక్తులు ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# ఇక విద్యుత్తు ఆర్డినరీ బస్సులు

హైదరాబాద్: గ్రేటర్‌లో సిటీ ఆర్డినరీ బస్సుల రూపుమారుతోంది. పాత బస్సుల స్థానంలో విద్యుత్తు ఆర్డినరీ బస్సులు చక్కర్లు కొట్టబోతున్నాయి. దసరాకల్లా ఇవి రోడ్డెక్కనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆర్డినరీ బస్సులకు భిన్నంగా ఏసీ బస్సుల రూపంలో ఇవి ఉండబోతున్నాయి. ఇప్పటికే ఏసీ, నాన్ ఏసీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ విద్యుత్తు బస్సులను తీసుకొచ్చిన ఆర్టీసీ తాజాగా ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణికుల స్పందన ఆధారంగా విడతల వారీగా మరిన్ని విద్యుత్తు బస్సులను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. కొత్తగా వచ్చే విద్యుత్తు ఆర్డినరీ బస్సులను ఏ మార్గాల్లో తిప్పాలన్న అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఇదీ లెక్క..100 విద్యుత్తు బస్సులను కొనుగోలు చేసి ఆర్డినరీలుగా నడపాలన్న ప్రతిపాదనలు ఉండగా తొలివిడతగా 10 బస్సులు తీసుకొచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.




ప్రస్తుతం నగరంలో 102 విద్యుత్తు బస్సులను నడుపుతుండగా..మరో 438 సమకూర్చుకునేందుకు చర్యలు చేపడుతోంది.

వీటికి అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల కోసం రూ.17 కోట్లు ఆర్టీసీ వెచ్చిస్తోంది.ప్రస్తుతం 102 విద్యుత్తు బస్సుల్లో 77 ఏసీ, 25 నాన్ ఏసీవి ఉన్నాయి.రెండు డిపోల్లో ఛార్జింగ్ పాయింట్లు సిద్ధం కంటోన్మెంట్, మియాపూర్ డిపోల్లో ఛార్జింగ్ పాయింట్ల పనులు పూర్తయి విద్యుత్తు సరఫరా జరుగుతోంది. హెచ్‌సీయూ, బీహెచ్‌ఈఎల్‌లోనూ పూర్తయి సరఫరాకు సిద్ధంగా ఉన్నాయి. జేబీఎస్‌లోనూ ఛార్జింగ్ యూనిట్ పూర్తయింది. పూర్తి స్థాయిలో విద్యుత్తు సరఫరా జరిగితే కొత్త బస్సులన్నీ రోడ్డెక్కనున్నాయి.

# ప్రసూతి ఐసీయూ ఏర్పాటుకు సన్నాహాలు

గోదావరిఖని పట్టణం: గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కేవలం ఐదు పడకల సామర్థ్యంతోనున్న ఎంఐసీయూ సరిపోవడం లేదు. ఆసుపత్రిలోని నూతన భవనంలో 'ఐసీయూ' ఉన్నప్పటికీ.. ప్రసూతి విభాగం పాత భవనంలో ఉంది. దీంతో నూతన భవనంలోని ఐసీయూలో గర్భిణులకు వైద్య సేవలందించే పరిస్థితుల్లేవు. ఈ క్రమంలో గర్భిణుల కోసం అత్యాధునిక వసతులతో పాత భవనంలో ప్రత్యేకంగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ) ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విస్తరించనున్న లేబర్ గది..

ఆసుపత్రి పాత భవనంలో గతంలో రక్తశుద్ధి కేంద్రం నిర్వహించిన ఆవరణలో ఐసీయూ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్‌లోని సహజ ప్రసవాల విభాగం(లేబర్ గది)లో కేవలం రెండు పడకలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఏకకాలంలో సహజ ప్రసవానికి గర్భిణుల సంఖ్య పెరిగినప్పుడు ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎంఐసీయూ వార్డులో ప్రసవం జరిపించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో లేబర్ గదిని విస్తరించాల్సి ఉంది. ప్రస్తుతం ఆసుపత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఐదు




పడకల సామర్థ్యంతోనున్న ఎంఐసీయూ (మెటర్నిటీ ఐసీయూ)లోకి.. లేబర్ గదిని తరలించినట్లయితే ఏకకాలంలో ఐదుగురుకి సహజ ప్రసవాలు చేసే అవకాశముంటుంది.

తగ్గిన ప్రసవాలు..

గతంలో ప్రాంతీయ ఆసుపత్రి స్థాయిలోనే సుమారు 400 ప్రసవాలతో రాష్ట్రస్థాయి రికార్డు సృష్టించింది. అయితే సార్వజనిక ఆసుపత్రిగా స్థాయి పెరిగాక ప్రసవాల సంఖ్య సగానికి పడిపోయింది. గతంలో కేవలం గోదావరిఖని ఆసుపత్రిలోనే ప్రసవాలు జరుగుతుండటంతో.. పెద్దపల్లి, మంథని, చెన్నూరు తదితర ప్రాంతాల నుంచి గర్భిణులు ప్రసవం కోసం ఇక్కడికి వస్తుండేవారు. ప్రస్తుతం పెద్దపల్లి, మంథని, మంచిర్యాలలో మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక వసతులతో ప్రసవాలు చేస్తుండటంతో.. ఇక్కడికి వచ్చే పరిస్థితులు కనిపించటం లేదు. అయితే గతంలో లేనివిధంగా గోదావరిఖని ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.

గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి- డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల సార్వజనిక ఆసుపత్రిలో ప్రసూతి సేవలను మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో అత్యాధునిక వసతులతో ప్రత్యేక ఐసీయూకు ఏర్పాట్లు చేస్తు న్నాం. లేబర్ గది విస్తరణతో సహజ ప్రసవాలకు సైతం ఎలాంటి ఇబ్బందులుండవు. మహిళలకు క్లిష్టమైన శస్త్ర చికిత్సలను సైతం విజయవంతంగా నిర్వహిస్తున్నాం. కార్పొరేట్ తరహాలో సదుపా యాలున్న గోదావరిఖని ఆసుపత్రి సేవలను గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలి.

# భద్రత కరవైన బాల్యం



పెద్దపల్లి : చదువుల తల్లి ఒడిలో హాయిగా సేద తీరాల్సిన బాలలకు భద్రత కరవైంది. చెత్త, ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో పాఠశాలల ఆవరణలు విష కీటకాలకు ఆవాసంగా మారాయి. ఏకాగ్రతతో పాఠాలు నేర్వాల్సిన విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాల భవనాల చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ఆదర్శ పాఠశాలలుగా గుర్తించిన 635 బడుల్లో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచాయి. ఆవరణలో కంకర, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై జిల్లా ఇన్‌ఛార్జి విద్యాధికారి జనార్దన్‌రావును మాట్లాడుతూ ముళ్ల పొదలు, పిచ్చిమొక్కల సమస్యపై ప్రధానోపాధ్యాయులు ఫిర్యాదు చేస్తే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో తొలగిస్తారన్నారు. విషపురుగుల బెడద లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాఠశాల : ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, మచిలీఖేడ్, పెద్దపల్లి.

సమస్య: బడి ముందు నుంచి మురుగు పారుతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది.

ఎప్పటి నుంచి: ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి.

ఎదురవుతున్న ఇబ్బందులు: పట్టణంలోని చాలా ప్రాంతాల మురుగు పాఠశాల ముందు నుంచే పారుతోంది. పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగుల ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల ఆవరణలో కంకర, ఇతర సామగ్రితో అపరిశుభ్రత నెలకొంది.

పరిష్కారం: చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, తుమ్మ పొదలు తొలగించాలి. మురుగు కాలువను మరో ప్రాంతానికి మళ్లించాలి.

పాఠశాల : ఓదెల మండలం హరిపురం ప్రాథమికోన్నత పాఠశాల.

సమస్య: ప్రహరీ లేక రక్షణ కరవు.

ఎప్పటి నుంచి: బడి ప్రారంభం నుంచి (25 సంవత్సరాలుగా)

ఎదురవుతున్న ఇబ్బందులు: సమీపంలో తుమ్మ పొదలు దట్టంగా పెరిగి పాములు, తేళ్ల సంచారానికి అవకాశం ఉంది. పాఠశాలకు ఎదురుగానే దహనవాటిక ఉండటంతో అంత్యక్రియల సమయంలో పాఠశాలలోకి పొగ వస్తోంది. విద్యార్థులు భయంతో పాఠశాలకు రావడం లేదు.

పరిష్కారం: ప్రహరీ నిర్మాణంతో పాటు దహనవాటిక తరలించడం.

పాఠశాల : కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.

సమస్య: సమీపం వరకు పెరిగిన పిచ్చిమొక్కలు.

ఎప్పటి నుంచి: ఏడాది కాలంగా.

ఎదురవుతున్న ఇబ్బందులు: విష కీటకాలు సంచరిస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు.

పరిష్కారం: పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి మొరం పోసి చదును చేయాలి.పాఠశాల : సుల్తానాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం.

సమస్య: పక్కనే ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువలో పేరుకుపోయిన చెత్త.

ఎప్పటి నుంచి: రెండు సంవత్సరాలుగా.ఎదురవుతున్న ఇబ్బందులు: ఈ నెల 11న ఆరో తరగతి విద్యార్థి మన్విత్ పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. గ్రామ శివారులోని పొలాల మధ్య ఉండటంతో విష కీటకాలకు ఆవాసంగా మారింది.పరిష్కారం: పాఠశాలలో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి, మురుగు కాలువ వద్ద భద్రత ఏర్పాట్లు చేస్తే విష పురుగుల బెడద సమస్య తొలగనుంది.

# ప్రకృతి సంపదను చెరబట్టి.. రాయల్టీకి గండికొట్టి



సిరిసిల్ల : ప్రకృతి సంపదను అక్రమార్కులు చెరబట్టారు. ప్రభుత్వ నిర్మాణాలకిచ్చిన తాత్కాలిక అనుమతులను ఆసరాగా చేసుకుని ప్రైవేటు అవసరాలకూ తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రూ.కోట్ల రాయల్టీకి గండి పడుతోంది. వీటిపై తరచూ జిల్లా రెవెన్యూ, గనుల శాఖలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తనిఖీలకు వెళ్తే అక్కడెవరూ కనిపించరు. ఇది మరీ విచిత్రమైన పరిస్థితి. జిల్లా కేంద్రానికి సమీపంలో పెద్దూరులోని మైసమ్మ గుట్టకు చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. అక్రమార్కులు వీటిని చెరిపేస్తున్నారు.

యంత్రాలతో తవ్వేస్తూ...మానేరువాగుపై చెక్‌డ్యాంల నిర్మాణం సమయంలో రెండువైపులా కాంక్రీటుతో రక్షణ గోడలు నిర్మించాలి. దీనికి బలం చేకూర్చేందుకు మట్టితో నింపి రాళ్లతో తెట్టును నిర్మించాలి. అప్పుడే చెక్‌డ్యాం వరదలకు కొట్టుకుపోకుండా ఉంటుంది. అయితే చెక్‌డ్యాం తొలి అంచనాల్లో ఈ ప్రతిపాదన లేదు. వరదలకు చెక్‌డ్యాంలు కొట్టుకుపోవడంతో మట్టికట్ట, తెట్టు నిర్మాణ పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచిం చారు. దీనికోసం ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వెంకటాపూర్‌లో నిర్మించిన చెక్‌డ్యాంలకు మైసమ్మగుట్టను సగానికిపైగా తొలిచేశారు. ఇప్పుడు మట్టి తవ్వకాల్లో బయటపడిన రాళ్లను తొలుస్తున్నారు.

పరిశోధకులు గుర్తించినా...జిల్లాలోని మానేరు పరీవాహక ప్రాంతంలో ఆదిమానవుల జీవనవిధానాలను చరిత్రకారులు కనుగొన్నారు. సిరిసిల్ల శివారులోని బర్కమ్మ, సీతారి గుట్ట ప్రాంతాల్లో పలు రాతి చిత్రాలు వెలుగుచూశాయి. వాటి ఆధారంగా పరిశోధనలు కూడా జరిగాయి. మైసమ్మ గుట్ట పూర్వం వ్యాపార కేంద్రంగా ఉన్నట్లు పరిశోధకులు అధ్యయనాల్లో గుర్తించారు. ఇక్కడ ఉన్న మట్టి ప్రతిమలను గ్రామదేవతలుగా ఇప్పటికీ కొలిచి పూజలు చేస్తారు. అందుకే దీనికి మైసమ్మ గుట్టగా పేరు వచ్చింది.

చరిత్ర పరిశోధకులు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ప్రతిమలు ఎక్కడా చూడలేదని చెబుతున్నారు. ఇవి ఎప్పటివనేది కూడా నిర్ధారణ కాలేదు. పశ్చిమబెంగాల్‌లోని గ్రామాల్లో కొన్ని రూపాలు గ్రామ దేవతలుగా కొలుస్తారని మాత్రం చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశోధిస్తే మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. అరుదైన చారిత్రక నేపథ్యం ఉన్న ఈ గుట్ట చుట్టూ తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తాం

– క్రాంతికుమార్, జిల్లా గనుల శాఖ సహాయ సంచాలకుడు

గుట్ట ప్రాంతంలో మట్టి తవ్వకాలకు అనుమతుల్లేవు. ఇది వరకు మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి పరిశీలిస్తాం. తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటాం.

# కంప్యూటర్లు ఎందుకిచ్చారు?

సంగారెడ్డి: విద్యాశాఖలో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల నమోదు, పాఠశాలల సమాచారం.. ఇలా సమస్తం అంతర్జాలంలోనే నిక్షిప్తం చేస్తున్నారు. వీటి కోసం మండల వనరుల కేంద్రాలకు 8 నెలల క్రితం కంప్యూటర్లను పంపిణీ చేశారు. వీటిని కార్యాలయంలో వినియోగించాలి. అయితే ఇందులో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయక మూలన పెట్టేశారు. దీంతో వివిధ రకాల నివేదికల తయారీలో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.జిల్లాలోని 18 పాత మండలాలకు(ఒక్కో మండలానికి) ఆరు కంప్యూటర్లు, ఇన్వర్టర్‌ను ఫిబ్రవరిలో పంపిణీ చేశారు. మార్చిలో విద్యుత్తు బోర్డులను ఏర్పాటు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో వీటిని వినియోగంలోకి తీసుకుకొస్తామని అధికారులు ప్రకటించినా ఇప్పటి వరకు అతీగతీ లేదు. సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయించాలని ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, వివిధ రకాల నివేదికలను కంప్యూటర్ల ద్వారానే అంతర్జాలంలో నమోదు చేయాలి. ఎమ్మార్సీ కేంద్రాల్లో ఇవి లేకపోవడంతో నివేదికలు తయారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని మండలాల్లో మాత్రమే వాడుతున్నారు.

ముందుకు సాగని పనులు

ఇప్పటి వరకు కొన్ని మండలాలకే ఎంఈవోలు ఉండడంతో పాత ఎమ్మార్సీ కార్యాలయాల నుంచే విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం 27 మండలాలకు విద్యాధికారుల నియామకం జరిగింది. వారు అక్కడే కార్యాలయాలను



ఏర్పాటు చేసుకుంటున్నారు. పాత ఎమ్మార్సీల్లో పని చేసే కొత్త మండలాల కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ సమన్వయకర్తలు కొత్త వాటికి వెళ్తారు. అయితే అక్కడకంప్యూటర్లు లేకపోవడంతో పనులు ముందుకు సాగే అవకాశం ఉండదు. కార్యాలయాల్లో వృథాగా ఉన్న వాటిని వినియోగిస్తే సమయానికి అన్ని నివేదికలు అందించవచ్చు.

నివేదికలు తెప్పించుకుంటాం ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఎక్కడెక్కడ కంప్యూటర్లు వినియోగించడం లేదో పూర్తిస్థాయిలో నివేదికలు తెప్పించుకుంటాం. అందుకు గల కారణాలు తెలుసుకుంటాం. ఆ దిశగా చర్యలు తీసుకుంటాం.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.

# నిధులు వాగుల పాలు

వేములవాడ: వాగులపై పైవంతెనలు లేక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు తాత్కాలిక రహదారులు కొట్టుకుపోతున్నాయి. ఫలితంగా రూ.లక్షల నిధులు వాగుల్లో కలుస్తున్నాయి. ప్రతి సంవత్సరం ప్రజాధనం వృథా అవుతున్నా పైవంతెనల నిర్మాణం చేపట్టక రవాణా కష్టాలు తీరడం లేదు.

వాగులు, ఒర్రెల వద్ద పైవంతెనలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ నిధులు మంజూరు కాక లక్షలాది రూపాయలు వెచ్చించి మొరం, మట్టితో తాత్కాలిక రోడ్లు వేస్తున్నారు. ఇందుకు కిలో మీటరు పొడవు తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణానికి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు మొరం మందాన్ని బట్టి ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చి కొట్టుకుపోయి నిధులు నీటి పాలవుతున్నాయి. అయినా నేతలు, అధికారులు పైవంతెనల నిర్మాణం చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్లు మొత్తం కొట్టుకుపోయి ప్రజల రవాణాకు ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల పైవంతెనల నిర్మాణ పనులు చేపట్టినా అవి పూర్తికాలేదు. వాటి దగ్గర వేసిన తాత్కాలిక రోడ్లు సైతం వరదకు నామరూపాల్లేకుండా పోయాయి.

వేములవాడ గ్రామీణ మండలంలోని హన్మాజీపేట నక్కవాగు వద్ద వంతెన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కాక పక్కనే వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఇటువైపు వెళ్లే బొల్లారం, లింగంపల్లి, మామిడిపల్లి తదితర గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వేములవాడ నుంచి బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి వైపు రోడ్డులో వంతెన పనులు చేపట్టినప్పటికీ అది పూర్తి కాలేదు. ఇక్కడ కూడా రోడ్డు వరదకు ఆనవాళ్లు లేకుండా పోయింది.

కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి- నిజామాబాద్ గ్రామాల మధ్య, ఇదే విధంగా బావుసాయిపేట- వెంకట్రావ్‌పేట మధ్య మూలవాగు ఉద్ధృతంగా పారడంతో తుడిచిపెట్టుకుపోయాయి. వట్టిమల్ల- నిమ్మపల్లి గ్రామాల మధ్య కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

చందుర్తి మండలంలోని మర్రిగడ్డ- సనుగుల, కోనరావుపేట మండలంలోని కొండాపూర్, జవహరిపేట- నర్సక్కపేట, రుద్రంగి మండలంలోని మానాల ప్రాంతాల్లోనూ రోడ్లు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. వేములవాడ పట్టణంలోని బతుకమ్మ తెప్ప నుంచి తిప్పాపూర్ మధ్య మూలవాగులో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి సందర్భంగా ఈ ఏడాది దాదాపు రూ.5 లక్షల వెచ్చించి నిర్మించిన మట్టి రోడ్డు వరదలో కలిసిపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగులపై పైవంతెనల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు చర్యలుఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. వర్షాలు తగ్గిన తరవాత అంచనాలు సిద్ధం చేసి పనులు చేపడతాం.

శాంతయ్య, డీఈ, ఆర్‌అండ్‌బీ

# హద్దులు తేలక.. హక్కులు తెలియక

సిరిసిల్ల : ప్రభుత్వ, ప్రైవేటు భూముల పహాణీలు, 1బి దస్త్రాలన్నీ వారి చేతుల్లోనే ఉన్నాయి. ఏం చేయాలనుకున్నా చేసే అధికారమూ ఉంటుంది. ఇదే అదనుగా ఓ రెవెన్యూ ఉద్యోగి హద్దుల్లేని ప్రభుత్వ భూమిలో పట్టా పొందాడు. రైతుబంధు జమవుతుండటంతో రెండేళ్ల క్రితం గ్రామస్థులు గుర్తించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుబంధును నిలిపివేయించారు. రెండ్రోజుల క్రితం అదే భూమికి హక్కుదారులమంటూ మరికొందరొచ్చారు. పశువుల మేత కోసం వదిలిన గుట్టప్రాంతాన్ని చదును చేయడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. హద్దుల్లేని రెవెన్యూ, అటవీ భూమిలో హక్కులు కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలోని కోనరావుపేట మండలంలో గతంలో పని చేసిన ఓ రెవెన్యూ ఉద్యోగి శివంగళపల్లి అడవి సరిహద్దులోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని దస్త్రాల్లో తన పేరున మార్చుకున్నాడు. గత ప్రభుత్వం 2018లో భూదస్త్రాల ప్రక్షాళన తర్వాత కొత్తగా ధరణిని తీసుకొచ్చింది. దీనిలోని రైతుల వివరాల ఆధారంగా రైతుబంధు అమలు చేసింది. ఇలానే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.40 వేలు చొప్పున జమయ్యాయి.

2021లో రైతుబంధు లబ్ధిదారుల జాబితాను గ్రామంలో ప్రదర్శించడ ంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో రైతుబంధును నిలిపివేశారు. భూమి పట్టా రద్దు కాలేదు.

ఇటీవల కొందరు గుట్టపై ఉన్న భారీ వృక్షాలను యంత్రాల సాయంతో నేలకూల్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అడ్డు చెప్పడంతో పాటు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పరిశీలించి అది అటవీశాఖ పరిధిలోనిది కాదని తేల్చారు. అయితే అనుమతి లేకుండా భారీ వృక్షాలను నరికినందుకు జరిమానా విధించారు.



చాలా ఏళ్ల క్రితం గ్రామంలోని నిరుపేదలకు అడవి సమీపంలోని ప్రభుత్వ భూమికి పట్టాలిచ్చారు. మిగిలిన భూమిని గ్రామంలో పశువుల మేతకు వదిలేశారు. ఇలా పట్టాలు చేయగా ఉన్న భూమిని దస్త్రాల్లోకి తన పేరున మార్చుకున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ధరణిలోనూ ఈ భూముల వివరాలేవీ చూపకపోవడంతో చేతులు మారినట్లు చెబుతున్నారు.

ఇలాంటివి ఎక్కడెక్కడ ఉన్నాయంటే...

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసాను ప్రకటించింది. గుట్ట ప్రాంతాన్ని సాగులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో రెవెన్యూ, అటవీ భూముల వివాదాలు కోనరావుపేట మండలం నిమ్మపల్లి, జైసేవాలాల్‌ఊరు తండా, వట్టిమల్లతోపాటు చందుర్తి, వీర్నపల్లి మండలాల్లోనూ ఉన్నాయి. కాగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, అటవీ భూములు ఉండటంతో గుర్తించడం కష్టంగా మారింది. అటవీశాఖ అధికారులు కంపార్టుమెంట్లు, కోఆర్డినేట్లు తీసుకుని కొలతలు వేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్వే సమయంలో రెండు శాఖల మధ్య తేడాలు వస్తున్నాయి. దీనికి తోడు దస్త్రాల నిర్వహణలోనూ లోపాలు ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

ప్రభుత్వ, అటవీ భూముల మధ్య హద్దులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శివంగళపల్లిలోని భూ వ్యవహారం జిల్లా అధికారుల దృష్టిలో ఉంది. దీనికి సంబంధించిన దస్త్రాలను అప్పగించాం. ఇప్పటికే రైతుబంధును నిలిపివేశారు. ఆ భూమిని గ్రామస్థులంతా గ్రామ అవసరాలకు ఉపయోగపడేలా ఉంచాలని కోరుతున్నారు.విజయప్రకాశ్, తహసీల్దార్

# గంగ ఉన్నా.. పంటలకు గగనమే!

తాండూరు : శివసాగర్ జలాశయం నుంచి ఈ ఏడాది కూడా ఆయకట్టుకు సాగు నీరు అందేలా కనిపించడం లేదు. నిధులు సిద్ధంగా ఉన్నా, రెండేళ్ల నుంచి పనులు పూర్తి కావడంలేదు. దీంతో నిర్దేశ ఆయకట్టుకు నీరందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం గగనంగా మారింది. ఏటా వర్షాలకు ప్రాజెక్టు నిండడం అలుగు పారడమే జరుగుతోంది. రైతులు వర్షాధార పంటలను సాగు చేయక తప్పడం లేదు.

**19ఏళ్ల కిందట పనులు ప్రారంభమైతే**

కాకరవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు 19 ఏళ్ల కిందట ప్రారంభమైంది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నదికి అడ్డంగా కరకట్ట నిర్మించారు. శిథిల భూమిలో నీటిని నిల్వ చేసి భూములకు వదిలేందుకు ప్రధాన తూము నిర్మించారు. అధికమైన నీరు దిగువకు వెళ్లేందుకు అలుగు నిర్మాణం ప్రమాణాల మేరకు జరగలేదు. దీంతో తూము వైపు ఒత్తిడి పెరగడంతో 2013లో వెలుపలి భాగం కొట్టుకుపోయింది. మరమ్మతులు చేయడంతో 2014 నుంచి నీరు నిల్వ ఉంటోంది. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం చేసిన గుత్తేదారును బ్లాక్ లిస్టులో చేర్చారు. అనంతరం నిధులు



మంజూరు చేసి మరో గుత్తేదారుకు పనులు అప్పగించినా ఫలితం లేదు. కట్టకు ఇరువైపులా వృక్షాలు పెరిగాయి. భూసేకరణ జరిగినా..: జలాశయం నుంచి ఆయకట్టు భూములకు నీటిని వదిలేందుకు కుడి, ఎడమ కాలువలను నిర్మించేందుకు ప్రభుత్వం భూములను సేకరించింది. రైతులకు పరిహారం చెల్లించారు. కాలువల నిర్మాణానికి ఇంజినీర్లు హద్దులు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందటే పనులు జరగాల్సి ఉన్నా, అడుగు ముందుకు పడలేదు. భూములు ఖాళీగా ఉండడంతో పరిహారం పొందిన రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం – సుందర్, ఎస్ఈ. జలాశయం పనులను ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం. వర్షాల కారణంగా పనులు స్తంభించాయి. అలుగు పనులు కొంత మేర జరగాల్సి ఉంది. ఇవి పూర్తి కాగానే కాలువల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తాం.

# ఊరికి ఉపకారులు

తాండూరు : ఎంత ఎదిగినా జన్మభూమిని మరువరు కొందరు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలకో... తాము పుట్టిపెరి గిన ఊరి బాగోగులకో.. కృషి చేస్తుంటారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసాలకు ఊతం అందిస్తున్న వారు ఉన్నారు. అలా స్వస్థలాల సేవలో తరిస్తూ.. మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు...

**స్థలం విరాళం.. చదువులు ఆధారం**

తాండూరు మండలం గుండ్లమడుగుతండాకు చెందిన సేవ్యానాయక్ గుంట స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించేందుకు విరాళంగా అందించారు. 1999లో చేసిన భూదానంతో తొలిసారిగా తండాలో సర్కారు బడి ఏర్పాటైంది. గిరిజన రైతు అందించిన సహకారం విద్యార్థు ల చెంతకే బడి వచ్చేలా చేసింది. అప్పటివరకు తండాలో బడిలేక చిన్నారులు అయిదు కిలోమీటర్ల దూరంలోని జినుగుర్తి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కొందరు చదువులకు దూరమయ్యారు. సొంత స్థలాన్ని పాఠశాల భవన నిర్మాణానికి అప్పగించడంతో పాఠశాల సంవత్సరాలుగా పాఠాలు నేర్పించేందుకు వెసులుబాటు లభించింది.

**రూ. లక్ష వెచ్చించి.. గుడి నిర్మించి** స్పందించే మనసు ఉంటే గుడికైనా, బడికైనా



సహకారం అందిస్తారు. ఆ కోవలోకే చేరుతారు కరుణా కర్‌రెడ్డి. పూడూరు మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన ఆయన కుటుంబంతో 30 ఏళ్ల కిందట తాండూరుకు వచ్చి స్థిరపడ్డారు. తల్లిదండ్రులు వెంకట్‌రెడ్డి, పుణ్యమ్మ, భార్య సుజాత సహకారంతో కోట్‌పల్లి మండలం సుల్తాన్‌పూర్‌లో ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇందు కోసం ముందుగా ఆయన రూ.లక్ష వరకు వెచ్చిం చారు. అనంతరం రెండు గ్రామాల ప్రజల సహకారంతో గతేడాది పనులు మొదలు పెట్టి ఈ ఏడాది పూర్తి చేశారు. హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో రెండు గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

**పదేళ్లుగా మాతృభూమి సేవలో..**

ఎన్నారై డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి స్వస్థలం జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి. సొంతూరుతోపాటు పక్క గ్రామమైన బూచినెల్లికి సేవలందించారు. ప్రభుత్వ పాఠశాలలకు మూడు ల్యాప్‌టాప్‌లు, 25 కంప్యూటర్లు అందజేశారు. 18 మంది గ్రామస్థులకు కంటి శస్త్రచికిత్సలు చేయించ డంతోపాటు 370 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ముగ్గురు పేద విద్యార్థుల పూర్తి ఫీజు చెల్లించే బాధ్యత తీసుకున్నారు. తొలి ఏడాది ఫీజు రూ.2.20 లక్షలు చెల్లించారు. ఓ బోరుబావి తవ్వించడంతోపాటు.. రెండేళ్ల కిందట గ్రామంలో రూ.18 లక్షలతో 22 సౌర విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించారు.

**నీటి వెత తీర్చి..**

దోమ మండలం మోత్కూర్ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులున్నారు. బడిలో ఏర్పాటు చేసిన ట్యాంకు మరమ్మతుకు గురైంది. దీంతో తాగునీటికి చిన్నారులు, మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ తెలిసింది. వెంటనే సంస్థ ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బడికి దగ్గర్లోనే గ్రామానికి నీటిని సరఫరా చేసే ట్యాంకు నుంచి పాఠశాల వరకు పైపులైన్ వేయించి ట్యాంకుకు, వంట గది వద్ద కుళాయి ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.10వేలు వెచ్చించారు. ప్రస్తుతం నిరంతరం నీటి సరఫరా కావడంతో సమస్య తీరింది. ఇంకే సమస్య ఉన్నా, సహకారం అందించేందుకు ముందుంటామని శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

# ఫొటో మీదే.... ఖాతానే నకిలీది



హైదరాబాద్ : ఊరెళ్లినా.. పండగొచ్చినా.. శుభకార్యం జరిగినా.. అక్కసు వెళ్లబోసుకోవాలన్నా సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం చాలామందికి అలవాటుగా మారింది. కానీ అక్కడ కనిపించే ఫొటోలు, మాటలే మాయగాళ్లకు పెట్టుబడిగా మారుతున్నాయి. ప్రతీకారం తీర్చుకోవాలనుకునే వారికి అస్త్రాలవుతున్నాయి. అటు బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తూ.. ఇటు మనోవేదనకు కారణమవుతున్న సామాజిక మాధ్యమాలతో అప్రమత్తంగా ఉండాలి. యాప్‌ల వేదికగా జరుగుతున్న వేధింపులపై గతేడాది 151 కేసులు నమోదైతే ఈ ఏడాది 9 నెలల్లో రెట్టింపు ఫిర్యాదులు అందాయి.

ఐపీఎస్‌ల పేరుతో...

డబ్బులు కావాలని మిత్రుడి ఫోన్ వస్తే ఎవరైనా స్పందిస్తారు. అడిగినంత పంపిస్తారు. సైబర్ మోసాల తీరిది. ఓ ఐపీఎస్ అధికారిణి ఫొటోలతో 18 ఫేస్‌బుక్ నకిలీ ఖాతాలు సృష్టించి పెద్దఎత్తున సొమ్ము కొట్టేసినట్టు కేసు నమోదైంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి డీపీతో రూ.10 లక్షలు కాజేసిన నిందితుడిని సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు.

వలపు వల విసిరి

సామాజిక మాధ్యమాల్లో స్నేహితుల జాబితాలోని మహిళల ఫొటోలను సేకరించి డీపీగా ఉంచి అర్ధరాత్రి దాటాక వీడియో కాల్ చేస్తున్నారు. స్పందించిన వారితో నగ్నంగా సంభాషిస్తు వీడియో తీసి ఆ దృశ్యాలు అంతర్జాలంలో ఉంచుతామంటూ బెదిరిస్తున్నారు. ఇటీవల విశ్రాంత ఐఏఎస్‌ను ఇదే తరహాలో భయపెట్టి డబ్బు డిమాండ్ చేశారు. మల్టీప్లెక్స్ యజమానికీ వలపు వల విసిరారు.

మచ్చుకు ఇలా..

ఇన్‌స్టాలో పరిచయమైన యువతిని రప్పించిన ప్రబుద్ధుడు సికింద్రాబాద్ హోటల్‌లో బంధించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

చాంద్రాయణగుట్ట చెందిన వ్యాయామ శిక్షకురాలి పేరిట ఇన్‌స్టాలో నకిలీ ఖాతాలు సృష్టించి అసభ్యకర పోస్టులు పెట్టాడు.

బంజారాహిల్స్‌లో ఉంటున్న ఉద్యోగిని పేరిట నకిలీ ప్రొఫైల్స్ రూపొందించిన మాయగాడు అశ్లీల అంశాలను జోడించి పోస్టులు చేస్తున్నాడు.నాంపల్లికి చెందిన ఓ యువతికి వివాహం నిశ్చయమైంది. తీరా అతనికి అప్పటికే పెళ్లయిందని శుభకార్యం రద్దు చేశారు. దీంతో యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ఉంచి వేధించసాగాడు.

# నిబంధనలకు పాతర



తాండూర్: పేదల కోసం ఏర్పాటు చేసిన చౌకధర దుకాణాల డీలర్లు నిబంధనలు పాటించడం లేదు. నెల మొత్తం రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలన్న నిబంధన అమలు కావడం లేదు. కొన్నిచోట్ల అనుకూలంగా ఉన్న వేళల్లో తెరిచి వెంటనే మూసేస్తున్నారన్న విమర్శలున్నాయి. మరికొన్నిచోట్ల నామ ఫలకాలూ ఏర్పాటు చేయలేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

డీలర్ల ఎంపికలో కొరవడిన పారదర్శకత..

కొత్తగా రేషన్ దుకాణం ఏర్పాటు ప్రకటన రాగానే దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి. అంగబలం, అర్థబలం, రాజకీయ నేపథ్యం ఉన్నవారికే రేషన్ డీలర్లుగా అవకాశమిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ పట్టణం, మండలంలో కలిపి 49 దుకాణాలున్నాయి. వాటిలో చాలావరకు బినామీల పేర ఉన్నాయని పలువురు చెబుతున్నారు. వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఒకరి పేరున రేషన్ దుకాణముంటే మరొకరు సరకులు పంపిణీ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ–పాస్ విధానంలో బియ్యం పంపిణీ చేస్తుండటంతో అక్రమాలకు కొంతవరకు కళ్లెం పడినా.. కొన్నిచోట యంత్రాలకు సంకేతాలు అందడం లేదు. మరికొన్ని చోట్ల పనిచేయడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జిల్లాలో చౌకధర దుకాణాలు: 588
ఆహార భద్రత కార్డులు: 2,14,284
అంత్యోదయ: 26,865
అన్నపూర్ణ: 36

చర్యలు తీసుకుంటాం..నిబంధనలకు లోబడి సరకులు పంపిణీ చేయాలని ఆదేశాలిచ్చాం. వినియోగదారులు ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో విచారిస్తాం. బినామీలుంటే వెంటనే డీలర్‌షిప్ రద్దుకు సిఫార్సు చేస్తా. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం. రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి.

# రాయితీతో సాగు.. లాభాలు బాగు



మెదక్ : ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. అటవీ జంతువులు, కోతుల వల్ల కూడా ముప్పు ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దీని సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. సాగు విస్తీర్ణం పెంచేందుకు 60–40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి రైతులకు ప్రోత్సాహకాలు, రాయితీలు అందజేస్తున్నాయి. దీనిపై కథనం..

పలు ప్రోత్సాహకాలు....

ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 90శాతం రాయితీతో ప్రభుత్వమే మొక్కలు అందజేస్తుంది. దీనితోపాటు 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు బిందు సేద్యంపై బీసీ రైతులకు 90శాతం, 5–12.50 ఎకరాల వరకు ఉన్న వారికి 80శాతం, ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీపై పరికరాలను అందజేయనున్నారు. అంతర్గత పంటలకు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇలా సాగు చేసుకుంటే ఏటా ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగు ఏళ్ల వరకు ప్రభుత్వం రాయితీ అందజేయనుంది.

నాలుగేళ్లకు లబ్ధి

సాగు చేసిన మొదటి సంవత్సరం ప్రభుత్వం నుంచి మొక్కలకు రూ.9650, బిందు సేద్యంపైన రూ.19500, అంతర్గత పంటలు సాగు చేసినందుకు రూ.4200తో కలిపి ఎకరాకు రూ.33,350 చెల్లిస్తుంది. రెండు నుంచి నాల్గో సంవత్సరం వరకు ఏటా రూ.4,200 చొప్పున మొత్తం రూ.12,600తో కలిపి మొత్తం నాలుగేళ్లు ఎకరానికి రూ.45,950 రాయితీ అందజేస్తుంది.

ఎకరానికి రూ.1.76లక్షల ఆదాయం...

సాగు చేసిన మూడో సంవత్సరం నుంచి ఎకరాకు 3–4 టన్నులు, 4–35 సంవత్సరాల వరకు 10–16 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం టన్నుకు రూ.14,700 ఉండగా, సాధారణంగా ఎకరానికి 12 టన్నుల దిగుబడి చొప్పున రూ.1,76,400 ఆదాయం ఆర్జించవచ్చు. నాలుగేళ్ల తర్వాత అంతర్గత పంటల స్థానంలో చాక్లెట్ల తయారీకి సంబంధించిన కొకొవా పంటలను సాగు చేసుకోవచ్చు. ఇవి నాటిన సంవత్సరం నుంచే దిగుబడి వస్తుంది. వీటి ద్వారా ఎకరాకు రూ.70వేల వరకు అదనపు ఆదాయం రానుంది.

మార్కెట్ సదుపాయం....

కేటాయించిన సంస్థనే మార్కెట్ సదుపాయం కల్పించి, పంట కొనుగోలు చేసిన 7–8 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయనుంది. మెదక్ జిల్లాకు లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని కేటాయించారు.

35 ఏళ్ల వరకు పంట

జిల్లాలో ఈ సంవత్సరానికి 1174 ఎకరాల్లో పంట సాగు చేసేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఒక్కసారి నాటితే 35 ఏళ్ల వరకు పంట వస్తుంది. మరిన్ని వివరాలకు నర్సాపూర్ ఉద్యానవన శాఖ అధికారి సంతోష్ చరవాణి నం.8977714422, మెదక్ ఉద్యానవన శాఖ అధికారిణి రచన నం.8977714423, కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ నం.7063402404కు సంప్రదించాలి.

ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి

# సంబరం మాయం.. సమస్యల స్వాగతం!

మూసీ నదీ గర్భంలో ఇళ్లను నిర్మించుకుని కొన్నేళ్లగా మురుగులో మగ్గినవారికి రెండు పడక గదుల ఇళ్లు కేటాయిస్తున్నామని చెప్పగానే అనేక మంది సంబరపడ్డారు. తీరా అక్కడికి వెళ్లిన నిర్వాసితులు.. సౌకర్యాలు లేని ఇళ్లను చూసి ఆందోళన చెందారు. కొన్నిచోట్ల తాగునీటి వసతి పూర్తిగా లేదు. మరికొన్ని చోట్ల ఇళ్ల లోపల సిమెంటు పనులు పూర్తికాలేదు. కొన్ని ప్రాంతాల్లో ఏడెనిమిది అంతస్తులకు వెళ్లడానికి లిఫ్టులు సరిగా లేక సమస్యలు ఎదురవుతున్నాయి.

రాజధానిలో నాలుగేళ్ల కిందటే రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాన్ని పలు ప్రాంతాల్లో ప్రారంభించారు. లక్ష ఇళ్లు లక్ష్యంగా మొదలుపెట్టి దాదాపు 40 వేల ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేశారు. నిధులు రాక గుత్తేదారులు ఏడాదిన్నర కిందటే మిగిలిన ఇళ్ల పనులు నిలిపివేశారు. తాజాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నిర్వాసితులు 16,000 మందికి ఈ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. వీటి నిర్మాణం పూర్తికి, వసతులు కల్పించడానికి రూ.700 కోట్లు కావాలని పురపాలక శాఖ కోరింది. నిధులింకా విడుదల కాలేదు. ఈ లోపే నిర్వాసితులను తరలించడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి మూసీ నిర్వాసితుల కోసం వనస్థలిపురంలోని రైతుబజార్ పక్కన జైభవానినగర్‌లో డబుల్ ఇళ్లను కేటాయించారు. ఇక్కడ గత ప్రభుత్వం 324 ఇళ్లను 9 అంతస్తుల్లో నిర్మించింది. ఇప్పటికే 230



ఇళ్లను కేటాయించారు. 94 ఖాళీగా ఉండగా కొత్తపేట, చైతన్యపురిలోని భవానినగర్ నుంచి తరలించిన 32 కుటుంబాలకు కేటాయించారు. ఇక్కడ తాగునీటి సమస్య ఉంది. నగరంలో వ్యాపారాలతో జీవించే తమను దూరంగా తీసుకురావడంతో ఉపాధికి దెబ్బతలిగిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

చంచల్‌గూడ చౌరస్తాలో మూసీ నిర్వాసితులు 145 మందికి గతంలో ఇళ్లను కేటాయించారు. తాజాగా మరి కొందరు నిర్వాసితులు రావడంతో వారి సంఖ్య 288కు చేరింది. తాగునీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాశ్వత పరిష్కారంగా పెద్ద పైపులైన్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. కొన్ని ఇళ్లలో సిమెంటు పనులు పూర్తిచేయలేదని వాపోతున్నారు.

# విద్యుత్తు విఘాతం

సిరిసిల్ల: జిల్లాలో ఆధునిక మరమగ్గాల వస్త్రోత్పత్తుల కేంద్రమైన టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ లేక... మరోవైపు విద్యుత్తు బిల్లులు గుదిబండలా మారాయి. మొన్నటి వరకు ప్రభుత్వ ఆర్డర్లతో అరకొరగా నడిచిన యూనిట్లు ఇప్పుడు మూసివేత దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికీ ఇందులోని 20 మూతపడ్డాయి. వీటిలో పని చేసే సుమారు వందకు పైగా కార్మికులు ఉపాధి కోల్పోయారు. పార్కులోని యూనిట్ల యజమానులు సమావేశమయ్యారు. ఉత్పత్తి చేసిన వస్త్రాలకు విక్రయాల్లేక కొత్త ఆర్డర్లకు పెట్టుబడి లేక.. కార్మికుల వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఈ నెల 6 నుంచి మూసివేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

టెక్స్‌టైల్ పార్కులో తయారయ్యే వస్త్రం జాతీయ మార్కెట్‌లో పోటీ పడలేకపోతోంది. దీంతో వీరు పక్క రాష్ట్రాల నుంచి ఆర్డర్లు తెచ్చుకుని ఉత్పత్తి చేస్తున్నారు. దానికీ విద్యుత్తు ఛార్జీలు భారం అయ్యాయి. సొంతంగా ఉత్పత్తి చేసి మార్కెట్ చేద్దామంటే ముడి సరకు అందుబాటులో ఉండదు. ఇన్ని ఒడుదొడుకులను ఎదుర్కొంటూ పరిశ్రమను నెట్టుకురాలేని పరిస్థితిలో యజమానులు మూసివేయాలనే ఆలోచన చేస్తున్నారు. వీరి నిర్ణయంతో పార్కులో వివిధ రంగాల్లో




పని చేసే కార్మికులకు ఉపాధి దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయి.

టెక్స్‌టైల్ పార్కులో వస్త్రోత్పత్తి యూనిట్లకు విద్యుత్తు సమస్య ప్రధానమైంది. 2003లో టెక్స్‌టైల్ పార్కు ప్రారంభమైంది. 2014 డిసెంబరు వరకు విద్యుత్తు బిల్లుల రీయింబర్స్‌మెంటు కింద రూ.8.68 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2015 జనవరి నుంచి 2020 డిసెంబరు వరకు పలు విడతల్లో రూ. 15 కోట్లు విడుదల చేశారు. 2021 జనవరి నుంచి రీయింబర్స్‌మెంటు విడుదల కావడం లేదు. దీంతో పరిశ్రమలు అతి కష్టం మీద నడుస్తున్నాయి. దేశంలోనే మరమగ్గాల వస్త్రోత్పత్తుల్లో పేరున్న మహారాష్ట్రలోని భీవండిలో ఇటీవల అక్కడి ప్రభుత్వం 27 హార్స్‌పవర్ వరకు విద్యుత్తును వినియోగించేవారికి యూనిట్‌కు రూ.1, అంత కంటే ఎక్కువ ఉంటే రూ.0.75 లను రాయితీగా ఇస్తామని ప్రకటించింది. మన దగ్గర రాయితీ కాకుండా ప్రభుత్వం రీయింబర్స్‌మెంటు రూపంలో చెల్లిస్తుంది. దాదాపు నాలుగేళ్ల నుంచి ఇది కూడా రావడం లేదు. ఇక్కడ ఉన్న చిన్న, మధ్య తరహా వస్త్రోత్పత్తి యూనిట్లకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు రాయితీ అందజేయాలని ఇది వరకే యజమానులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రాలేదు.

# మాకిక్కడ.. మీకింకోచోట

హైదరాబాద్ : మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుకు రక్షణ భూముల సేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం రక్షణ శాఖతో సంప్రదింపులు చేయనున్నారు. వాటికి బదులుగా వేరే ప్రాంతం లో అంతకు విలువైన భూములను కేటాయిం చేం దుకు నిర్ణయించారు. మూడు మండలాల పరిధిలో 300 నుంచి 500 ఎకరాల రక్షణ శాఖ భూములున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే నగరంలో మొత్తం 55 కి.మీ పొడవున మూసీకి అటూ ఇటూ 50 మీటర్ల మేరకు ఆక్రమణలు, నిర్మాణాలను గుర్తించి వాటికి మార్కింగ్ వేసే ప్రక్రియ వేగంగా సాగుతోంది.ప్రత్యేకత: ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ తయారీకి తాజాగా మరోసారి నోటిఫికేషన్ జారీ చేశారు.



ప్రక్షాళనతో సరిపెట్టకుండా గుజరాత్‌లోని సబర్మతి, లండన్‌లోని థేమ్స్ మాదిరిగా సుందరీకరణ, బోటింగ్, ఫుడ్‌కోర్టులు, మాల్స్ వచ్చేలా రూపకల్పన చేయనున్నారు.

ఇబ్బందుల్లేకుండా..: భవిష్యత్తులో ఎఫ్‌టీఎల్‌కు ఎలాంటి ఆటంకం లేకుండా మూసీ పరిధిలో అభివృద్ధి చేయడం కీలకమని భావిస్తున్నారు. గండిపేట, రాజేంద్రనగర్, గోల్కొండ మండలాల్లో రక్షణశాఖకు వేలాది ఎకరాల భూములున్నాయి. మార్కెట్ ధరతో సమానంగా అంతే భూమిని రక్షణశాఖకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# జారీ ఇష్టారాజ్యం.. పర్యవేక్షణ పూజ్యం

హైదరాబాద్ : నగరంలో నకిలీ ట్రేడ్ లైసెన్సులు కుప్పలుతెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఆన్‌లైన్‌లో రూ.350 చెల్లిస్తే చాలు.. ఎలాంటి పత్రం లేకపోయినా ధ్రువీకరణపత్రం మంజూరవుతుంది. జీహెచ్‌ఎంసీ అమలు చేస్తోన్న 'ఇన్‌స్టాంట్ అప్రువల్' విధానమే అందుకు కారణం.అనుభవమైనా పట్టింపేది..? : గతంలో ఈ విధానం ఆస్తిపన్ను, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీకి కూడా అందుబాటులో ఉండేది. స్వీయ మదింపు పేరుతో కేటుగాళ్లు 35వేల నకిలీ ఇంటి నెంబర్లను, 27వేల నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. ఆయా పత్రాలను ఉపయోగించి అక్రమార్కులు అనేక మోసాలకు పాల్పడ్డారు. దీంతో అప్పట్లో ఆస్తిపన్ను, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీలోని 'ఇన్‌స్టాంట్ అప్రువల్' విధానాన్ని రద్దు చేశారు. ట్రేడ్ లైసెన్సుల జారీపై నిర్ణయం తీసుకోలేదు. దీంతో నాలుగేళ్ల నుంచి దాదాపు 50వేల ట్రేడ్ లైసెన్సులు పుట్టుకొచ్చి ఉంటాయని అంచనా.

**తెల్ల కాగితాలు అప్‌లోడ్ చేసి..**




మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ గురువారం రెండు నకిలీ ట్రేడ్ లైసెన్సులను సృష్టించాడు. ఆన్‌లైన్ దరఖాస్తులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేరును చేర్చి, డ్రగ్స్ మార్ట్ వ్యాపారాన్ని తెరిచేందుకుగాను లైసెన్సు కావాలంటూ, తెల్ల కాగితాలు అప్‌లోడ్ చేసి లైసెన్సులు పొందారు. గతంలో మల్కాజిగిరి సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం భవనానికి మేయర్‌ని యజమానిగా పేర్కొంటూ నకిలీ ఇంటి నెంబరును సృష్టించారు.

**సగానికి పైగా నకిలీవే..**

కొత్తగా 2022లో 43,888 లైసెన్సులు, 2023లో 54,744, 2024(ఏప్రిల్ వరకు)లో 4,646 లైసెన్సులు జారీ కాగా.. వాటిలో సగానికిపైగా నకిలీవేననే ఆరోపణలు ఉన్నాయి. దుకాణ విస్తీర్ణాన్ని తక్కువగా చూపించి కొందరు లైసెన్సు పొందుతున్నారు. ఇలా జీహెచ్‌ఎంసీ గత నాలుగేళ్లలో రూ.50కోట్ల నష్టపోయినట్లు అంచనా.

# ఎంపాక్స్... ప్రత్యేక వార్డులు సిద్ధం

హైదరాబాద్ : ప్రపంచవ్యాప్తంగా ఎంపాక్స్ (మంకీపాక్స్) అలజడి రేకెత్తిస్తున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే గాంధీ, నల్లకుంట ఫీవర్ ఆసుపత్రులను సిద్ధం చేసింది. అక్కడ ప్రత్యేక వార్డులు నెలకొల్పింది. గాంధీలో 20 పడకలు కేటాయించారు. ఇందులో పురుషులకు, మహిళలకు పదేసి పడకలు కేటాయించినట్లు గాంధీ వైద్యులు పేర్కొన్నారు. ఫీవర్ ఆసుపత్రిలో ఆరు పడకలు అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాకపోయినా అప్రమత్తంగా ఉండటం అవసరమని వైద్యులు చెబుతున్నారు.

వ్యాప్తి ఇలా.. ఎంపాక్స్ లక్షణాలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కాంగో, నైజీరియా, కామెరూన్ దేశాల్లో కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఆ దేశాల నుంచి వచ్చే వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఐసోలేషన్‌లో ఉండటం.. లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రిలో చేరాలని సూచించారు.రక్తం, శరీర ద్రవాలు, చర్మ గాయాలు, శ్వాసకోశ స్రావాల ద్వారా ఇతరులకు సోకుతుంది.ఈ లక్షణాలు ఉంటే..

హఠాత్తుగా జ్వరం రావడం తలనొప్పిజి కండరాల నొప్పులు,వెన్నునొప్పిజి కాళ్లు, చేతులు, ముఖంపై దద్దుర్లు, దురద

చలి, తీవ్ర అలసట

# వ్యర్థాల్లో అర్థం.. పరమార్థం




హైదరాబాద్ : హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైన 'ఎకో సస్టైన్ ఎక్స్‌పో'లో వేర్వేరు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రతినిధులు తమ ఆవిష్కరణలు, పేటెంట్ పొందిన నమూనాలను ప్రదర్శించారు. గృహ, వాణిజ్యపరంగా ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలు, వ్యర్థజలాలను పునర్వినియోగించేలా రూపొందించిన ప్రోటోటైప్‌లను సందర్శకులకు వివరించారు. ఇందులో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువగా ఉపయోగపడే 'ఫుడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' (చగ్), 'డీసెంట్రలైజ్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్' నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

బయోగ్యాస్ తయారీ ఇలా.. కంపోస్ట్ పద్ధతికి భిన్నంగా 'అనెరోబిక్' పద్ధతిలో వ్యర్థాలను ఎరువులు, బయోగ్యాస్‌గా మారుస్తున్నారు. 50 కేజీల ఆహార వ్యర్థాలను వేస్తే 1 కేజీ ఎల్పీజీ గ్యాస్ పరిమాణంతో బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయొచ్చని చెన్నైకి చెందిన ఎవిర్స్‌టెక్ సంస్థ ప్రతినిధి వి.భరత్ తెలిపారు. ఆహార వ్యర్థాలను 'అనెరోబిక్ డైజెషన్ పద్ధతిలో' తక్కువ సమయంలో ఎరువుగా మారుస్తుంది. ఇంట్లో రోజూ ఉత్పత్తి అయ్యే ఆహార వ్యర్థాలను ఫుడ్ క్రషర్‌లో వేయాలి. అనంతరం దానిని ఫుడ్ వేస్ట్ స్లర్రీ కోసం కేటాయించిన డ్రమ్ములో వేయాలి. దానికి అనుసంధానించిన ఫుడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అది పయనించి చగ్‌పై అమర్చిన రియాక్టర్‌లో బయోగ్యాస్, ఎరువులను తయారు చేస్తుంది. బయోగ్యాస్‌ను తక్కువ ఒత్తిడితో ఇంట్లో వినియోగించుకోవచ్చు. 'బ్లాక్‌గోల్డ్'గా పిలిచే ఎరువును ఇంట్లో గార్డెనింగ్‌కు వినియోగించొచ్చు లేదా విక్రయించొచ్చు. అపార్ట్‌మెంట్ సముదాయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆఫీసు క్యాంటీన్లలో వీటిని పెద్దఎత్తున వినియోగించొచ్చు.

3 కేఎల్‌డీ సామర్థ్యంతో ...

20 నుంచి 30 కుటుంబాలున్న అపార్ట్‌మెంట్లలో వ్యర్థ జలాల నిర్వహణ సరిగా ఉండటం లేదు. వీటికి పరిష్కారంగా కర్ణాటకకు చెందిన ఇన్నోవేటివ్ వాటర్ టెక్నాలజీస్ అంకుర సంస్థ 3 కేఎల్‌డీ సామర్థ్యంతో 'డీసెంట్రలైజ్డ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్'ను రూపొందించింది. తక్కువ ఖర్చులో వ్యర్థ జలాల నిర్వహణ, పునర్వినియోగించేలా దీనిని రూపొందించింది. రోజూ ఉత్పత్తయ్యే వ్యర్థజలాలను బయోజోన్ ట్యాంక్‌కు అనుసంధానం చేస్తారు. ఏరియేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత శుద్ధి చేసిన జలాలు ట్యూబ్ సెట్లర్ యూనిట్ లోకి వెళ్తాయి. ఇక్కడ రెండోసారి శుద్ధి చేసి డోసింగ్ పంపుల ద్వారా క్లోరినేషన్ చేస్తారు. అనంతరం శాండ్ ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసి పంపుతారు. ఈ నీటిని గార్డెనింగ్ తదితరాలకు వినియోగించొచ్చు. సెట్లింగ్ ట్యాంక్‌లో మిగిలిపోయిన వ్యర్థాలు స్లడ్జ్ ట్యాంక్‌లో ఉండిపోతాయి. వాటిని తీసేయొచ్చు.

# కిడ్నీ బాధితులకు భరోసా



కోరుట్ల: డయాలసిస్ కేంద్రాలు గతంలో కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉంటుండేవి. కిడ్నీ వ్యాధిగ్రస్థులు మూడు రోజులకొకసారి వెళ్లి రక్తం శుద్ధి చేయించుకోవడం తీవ్ర ఖర్చుతో కూడుకొని ఉండేది. ప్రైవేటు ఆసుపత్రిలో ఖర్చుతోపాటు రవాణా వ్యయం భారమయ్యేది. ఆర్థికంగా ఉన్నవాళ్లు మాత్రమే సక్రమంగా చికిత్స చేయించుకునే వారు. నిరుపేదలు తరచూ వెళ్లే వీలుకాకపోవడంతో ప్రాణాలు కోల్పోయేవారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ కేంద్రాన్ని కోరుట్లలో ఏర్పాటు చేయడంతో కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన రోగులు సద్వినియోగం చేసుకుంటున్నారు. 2016 నుంచి ప్రభుత్వం ఉచిత బస్‌పాస్‌తోపాటు నెలకు రూ.2016 ఆసరా పింఛన్ అందజేస్తోంది.కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 2023 జనవరి 5న డయాలసిస్ కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, డీసీడీసీ కిడ్నీ కేర్ సంయుక్తంగా సేవలు అందించాలని నిర్ణయించారు. ముందుగా 5 రక్తశుద్ధి యంత్రాలను సమకూర్చడంతో ఆసుపత్రి పైఅంతస్తులో ప్రత్యేక విభాగంలో కేంద్రం ఏర్పాటు చేసి ఫిబ్రవరి 5 నుంచి రోగులకు డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇటీవల మరో 5 యంత్రాలను ప్రభుత్వం కేటాయించడంతో మొత్తం 10 యంత్రాల ద్వారా నిత్యం 30 మందికిపైగా రోగులకు రెండు విడతల్లో డయాలసిస్ చేస్తున్నారు.

100 మందికిపైగా చికిత్స

కోరుట్ల డయాలసిస్ కేంద్రంలో మొత్తం 100 మందికిపైగా కిడ్నీ బాధితులు నమోదు చేయించుకున్నారు. రోగులకు వైద్య సేవలందించేందుకు కేంద్రం మేనేజర్, 13 మంది టెక్నీషియన్లు ఉన్నారు. వీరు ఉదయం 5.30 నుంచి రాత్రి 12 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 30 మందికిపైగా రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ఒక్కొక్కరికి 4 గంటల సమయం పడుతుంది. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి నెఫ్రాలజీ వైద్యులు టెలీమెడిసిన్ ద్వారా ఎప్పటికప్పుడు రోగుల రిపోర్టు ఆధారంగా చికిత్స అందిస్తుంటారు. అత్యవసర సమయంలో ఆసుపత్రిలోని ఇతర వైద్యులు చికిత్స చేస్తుంటారు. ఇప్పటివరకు 10,000లకుపైగా షిఫ్టుల్లో రోగుల రక్తం శుద్ధి చేశారు. ప్రతి రోగికి కొత్త వైద్య పరికరాలను అమర్చి చికిత్స చేస్తుంటారు. ఇక్కడ చికిత్స పొందిన ఆరుగురు కిడ్నీ వ్యాధిగ్రస్థులు కిడ్నీ ట్రాన్స్‌ప్లానింగ్ చేయించుకున్నారు. మరో నలుగురు ట్రాన్స్‌ప్లానింగ్ చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

మాది ఇబ్రహీంపట్న మండలం డబ్బా గ్రామం. నేను హోటల్ నడుపుతుంటాను. ఆరేళ్ల కిందట నా కిడ్నీలు చెడిపోయాయి. అప్పటి నుంచి ఇతర పట్టణాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునే వాడిని. కోరుట్లలో కేంద్రం ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి మూడు రోజులకు ఒకసారి వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాను. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాను.

సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం అందుబాటులో ఉండటంతో నిత్యం కిడ్నీ రోగులు వచ్చి సేవలు పొందుతున్నారు. రోజుకు 30 మందికిపైగా రోగులకు డయాలసిస్ చేస్తున్నాం. 50 మంది వరకు వినియోగించుకునే వీలుంది. నిత్యం వైద్యుల పర్యవేక్షణలో టెక్నీషియన్లు రక్తం శుద్ధి చేస్తుంటారు.– సునీతారాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్


# రుణ మాఫీకి తప్పని పాట్లు

పెద్దపల్లి : ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ రైతులను కలవరపెడుతోంది. సాంకేతిక తప్పిదాలు, ఇతర కారణాలతో అర్హులైన రైతులకు దూరం చేసినట్లయింది. రోజుల తరబడి బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ అన్నదాతలు ప్రదక్షిణలు చేస్తున్నారు. రోజు రోజుకూ ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోంది. దీంతో అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అమలు చేసేందుకు రైతు వేదికల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హుల జాబితా రూపొందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

అనేక కారణాలు 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు పొందిన పంటరుణాలకు రూ.2 లక్షల రుణం మాఫీ కానుంది ఒకే రేషన్‌కార్డులో కుటుంబ సభ్యులందరూ కలిపి రూ.2 లక్షలలోపు ఉన్న వారికి మాఫీకాలేదు.రేషన్‌కార్డు లేకపోవడంతో కుటుంబ సభ్యుల నిర్ధారణ కాలేదు.బ్యాంకుఖాతా, ఆధార్ నంబరు సరిపోలకపోవడం, వివరాలు సక్రమంగా నమోదుకాకపోవడం. బ్యాంక్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం.

జిల్లాలో మరో 17 వేల మంది..

జిల్లాలో రుణమాఫీ కావాల్సిన వారు సుమారుగా మరో 17 వేల మంది ఉంటారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరి నుంచి రైతువేదికల్లో అర్జీలు స్వీకరిస్తున్నారు. రైతుల నుంచి తీసుకున్న దరఖాస్తులను ఏవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇప్పటి వరకు మొదటి విడతలో 29,724 మంది రైతులకు రూ.149.42 కోట్లు, రెండో విడతలో 13,401 మంది రైతులకు రూ. 124.40 కోట్లు, మూడో విడతలో రూ.8,268 మంది రైతులకు రూ.101.75 కోట్లు మొత్తం 51,393 మంది రైతులకు రూ. 375.58 కోట్లు మాఫీ అయింది. మరో 17



వేల మందికి రూ.242.85 కోట్లు మాఫీ కావాల్సి ఉంది.

రేషన్‌కార్డు లేదని ఎస్టీపీసీ కేంద్ర సహకార బ్యాంకులో గతేడాది ఆగస్టులో రూ. లక్ష పంట రుణం తీసుకున్నా. మూడు విడతల వరకు ఎదురుచూశా. అధికారులను అడిగితే రేషన్‌కార్డు లేకపోవడంతో రాలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి రుణమాఫీ చేసి ఆదుకోవాలి.
–అర్జున్, రైతు, పాలకుర్తి

ముగ్గురిలో ఎవరికీ మాఫీకాలేదు

నా భార్య, తండ్రితో కలిసి ముగ్గురి పేరిట వేర్వేరు బ్యాంకుల్లో రూ.2.60 లక్షల రుణం ఉంది. ముందుగా భార్యకు మాఫీ అనిచెప్పారు. ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. ముగ్గురి పేర్లు ఒకే రేషన్‌కార్డులో ఉండటంతో మాఫీ కాలేదని అధికారులు చెబుతున్నారు.
–తిరుపతి, అబ్బాపూర్, జూలపల్లి మండలం

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

జిల్లాలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తాం. అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదించనున్నాం. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయనున్నాం.
–ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

# 8 నెలలవుతుంది.. ఎత్తిపోసేదెన్నడో?

ధర్మపురి: పట్టణ సమీపంలో ఉన్న అక్కపల్లి రిజర్వాయర్ పనులు గత ఎనిమిది నెలలుగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభించిన కొద్ది నెలలకే ఎన్నికల కోడ్ రావడం.. ఈలోగా మళ్లీ డిజైనింగు అనుమతులు రావాల్సి ఉండడంతో ఆగిపోయాయి. గోదావరి జలాలతో ధర్మపురికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రిజర్వాయర్‌లోకి సాగు నీటిని ఎత్తిపోయడం ద్వారా 5,500ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం చేసే లక్ష్యంతో గత ప్రభుత్వం ఈ పనులు ప్రారంభించింది. మిషన్ కాకతీయలో భాగంగా చెరువు అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు కేటాయించగా.. ఇవన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. ఆ తర్వాత గోదావరి ఎత్తిపోతల పథకానికి రూ.60.90 కోట్ల నిధులు విడుదలయ్యాయి. సుమారుగా గోదావరి నుంచి ఒక కిలోమీటరు దూరంలో భారీ మొత్తంలో నీటిని నిలువ చేసే లక్ష్యంతో పెద్ద బావిని తవ్వారు. అయితే డిజైనింగులో సాంకేతిక పరంగా అనుమతులు రావాల్సి ఉంది. దీంతో ఈ పనులన్నీ పెండింగులో ఉండిపోయాయి.

**అధికారులు అనుమతి ఇస్తేనే..** ఈ పథకం బావికి గోదావరి నుంచి అనుసంధానం చేయడం.. ఆ తర్వాత పైపులైను ఏర్పాటుచేసి, అక్కపల్లి చెరువులోకి ఒక సెకన్‌కు 50 క్యూసెక్కుల నీటిని పంపించేలా కాలువలను నిర్మించాల్సి ఉంది. ఇరిగేషన్ అధికారులు అనుమతి



ఇస్తేనే ప్రారంభమయ్యే అవకాశముం ది. చెరువులో ఎల్లప్పుడూ 0.15 టీఎంసీలు నీటిని నిలువ ఉంచేలా ఎస్సారెస్పీ అధికారులు స్థిరీకరించారు. ఈ పనులు పూర్తయితే ధర్మపురి పట్టణంతోపాటు పలు గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్య తీరనుంది.

**ఏటా ఇబ్బందులే..**

అక్కపల్లి చెరువును రిజర్వాయర్‌గా మార్చినా.. నీటి సౌలభ్యం లేక సాగునీరు అందడం లేదు. దీంతో ధర్మపురితోపాటు, నర్సయ్యపల్లె, కోరండ్లపల్లె, బుద్దేశ్‌పల్లి, తుమ్మెనాల, నాగారం, కమలాపూర్, కొత్తకోరండ్లపల్లె ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడితే చెరువు నిండి.. కొద్ది రోజులకు మత్తడి ద్వారా నీరు ఖాళీ అవుతోంది. ఈ పల్లెల్లో రైతులు వ్యవసాయం మానివేసి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే పుష్కలంగా సాగు నీరందే అవకాశముందని విస్తున్నారు.

**పూర్తయిన పనులు ఇవే..**


గతేడాది అక్కపల్లి చెరువును అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసింది. దీంతో చెరువు చుట్టూ పొడవునా నూతనంగా కట్టను ఆధునికీకరించారు. ఆయకట్టుకు నీరందించేలా కాలువలను రూపొందించారు. గత వేసవిలో చెరువులో నీరు నిలిచేలా పూడిక తీయించారు. మరికొన్ని పనులు పెండింగులో ఉన్నాయి. ఇవి కూడా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం** అక్కపల్లి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రీడిజైనింగు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. పనులు పూర్తయితే ధర్మపురి ప్రాంతంలోని బీడు భూములన్నీ సస్యశ్యామలం అవుతాయి.– సాజిద్, ఏఈ, ఎస్సారెస్పీ, ధర్మపురి

# బిల్లులు రావు.. పోషకాలు లేవు!

గోదావరిఖని : 'పిండి కొద్దీ రొట్టె' అన్నారు పెద్దలు.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిస్థితి కూడా అలాగే తయారయింది.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో నిర్వాహకులు ఆహారంలో పోషకాలను పక్కన పెడుతున్నారు.. గోరుచుట్టుపై రోకటి పోటులా నిత్యావసరాల ధరలు మండుతుండటంతో పలుచని చారు.. తక్కువ ధర కూరలతో సరిపుచ్చుతున్నారు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,500 మంది వరకు మధ్యాహ్న భోజన నిర్వాహకులున్నారు. ఒక్కొక్కరికి రూ.60 వేల నుంచి రూ.2 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 9, 10 తరగతులకు సంబంధించి గత విద్యా సంవత్సరం చివరి నెల బకాయిలు కూడా ఇంకా రావాల్సి ఉంది. దీంతో అప్పులు తెచ్చి.. అరువులకు సరకులు తీసుకుని భోజనం వండాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. మరోవైపు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. మెనూ ప్రకారం భోజనం చేస్తే ఒక్కో విద్యార్థికి కనీసం రూ.15 ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. తక్కువ విద్యార్థులు ఉ



న్న పాఠశాలల్లో కొంత వరకు ఖర్చు తక్కువగా ఉన్నా, విద్యార్థులు ఎక్కువ ఉన్న పాఠశాలల్లో ఆర్థిక భారమవుతోంది. దీంతో నిర్వాహకులు తక్కువ ధరలో వచ్చే ఆలుగడ్డ ఇతర కూరగాయలతో వంటలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉదయం విద్యార్థులకు రాగి జావ ఇవ్వాలని నిర్ణయించినా అందుకు సంబంధించి నిధులు రాకపోవడంతో నిర్వాహకులు తయారు చేయడం లేదు. దీంతో ఆ పోషకాహారమూ అందడం లేదు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వర్కర్లు తమకు నెలలుగా వేతనాలు, బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల డీఈవోలు జనార్దన్‌రావు, మాధవి, జగన్‌మోహన్‌రెడ్డి, రమేశ్‌లు మాత్రం ఎప్పటికప్పుడు బిల్లులు తయారు చేసి ట్రెజరీకి పంపుతున్నామని చెప్పారు. జూన్ వరకు బిల్లులు విడుదలయ్యాయని జులైవి త్వరలో విడుదలవుతాయని చెప్పారు. కాగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు మాత్రం తమకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరైతేనే మెనూ అమలు చేయగలమని, అప్పులు చేసే పరిస్థితి రాదని పేర్కొంటున్నారు.




# ఏపీ రాజధానికి రైల్వే ట్రాక్‌పై ఏపీ ఎంపీల కీలక ప్రకటన

అమరావతి, అక్టోబర్ 4: రాష్ట్ర రాజధాని అమరావతికి రైల్వే ట్రాక్‌కు సంబంధించి ఏపీ ఎంపీలు కీలక ప్రకటన చేశారు. రాజధాని అమరావతిని కలుపుతూ త్వరలో రైల్వే ట్రాక్ రాబోతోందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌లో ఎంపీలు సమావేశమయ్యారు. అనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడారు. ఆర్వోబీలు, ఆర్‌యూబీలు అభివృద్ధి చేయాలని కోరామని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. గత ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లే పెండింగ్‌లో ఉన్నాయని రైల్వే అధికారులు తెలిపారన్నారు. మరిన్ని కొత్త రైళ్లు, వందేభారత్ రైళ్లు కావాలని కోరామన్నారు. విజయవాడ నగరంలో డ్రైనేజి సమస్య రైల్వేతో ముడిపడి ఉందన్నారు. రైల్వే , రెవెన్యూ , మున్సిపల్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరగా అందుకు జీఎం అంగీకరించారన్నారు. గత ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేసి ఉంటే విజయవాడకు వరద కష్టాలు ఉండేవి కావన్నారు. ఈ ఐదేళ్లలో రైల్వే పరంగా ఉన్న సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.

**ఆ స్టాపులను పునరుద్ధరించాలని కోరాం: బాపట్ల ఎంపీ** – రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ కొత్త లైన్ రాబోతుందని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. రేపల్లె – బాపట్ల , మధ్య కొత్త లైన్ కావాలని కోరామన్నారు. విజయవాడ –గూడూరు మధ్య నాలుగో లైన్ ఏర్పాటు చేయాలని కోరామని.. అలాగే.. బాపట్ల, చీరాలలో వందే భారత్ రైలు స్టాప్ ఉండాలని కోరామని తెలిపారు. బెంగళూరుకు వందేభారత్ స్లీపర్ కావాలని ప్రతిపాదన పెట్టామన్నారు. గతంలో నిలిపిన సూపర్ ఫాస్ట్, ఎక్స్ ప్రెస్ రైళ్ల స్టాపులు పునరుద్ధరించాలని కోరామన్నారు. విజయవాడ డివిజన్‌లో 493 లొకేషన్లలో ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ రావాల్సి ఉండగా ... గత ప్రభుత్వంలో కేవలం 10 శాతమే కట్టారన్నారు. వెంటనే అన్నీ పూర్తి చేయాలని జీఎంను ఎంపీలంతా కోరగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. పలు రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాలు పెంచాలని ఎంపీలంతా కోరారని అన్నారు. రైళ్లు ఢీ కొనకుండా కవచ్‌ను అన్ని రైళ్లలో ప్రవేశపెడుతున్నట్లు ఎంపీ తేన్నెటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. కొత్త రైల్వే లైన్లు,కొత్త రైళ్లు మంజూరు చేయాలని ఎంపీలు జీఎంను కోరారని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. అవసరమైన చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జిలు, రైల్వే ఒవర్ బ్రిడ్జీలు నిర్మించాలని ఎంపీలు కోరారన్నారు. కర్నూలులో రైల్వే వర్క్ షాప్‌ను అభివృద్ధి చేయాలని జీఎంను కోరినట్లు ఎంపీ తెలిపారు.


**పాసింజర్ రైళ్లను పెంచాలని కోరాం: ఎంపీ లక్ష్మీనారాయణ** – రాష్ట్రంలో రైల్వే సమస్యలు వేగంగా పరిష్కరించాలని జీఎంను కోరగా సానుకూలంగా స్పందించారని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరామని తెలిపారు. విజయవాడ – బెంగళూరు మధ్య తిరిగే కొండవీడు ఎక్స్ ప్రెస్‌ను రోజూ నడపాలని కోరామన్నారు. అలాగే బెంగళూరు – పుట్టపర్తికి నడిచే ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురంకు పొడిగించాలని కోరామన్నారు. ప్రయాణికుల దృష్ట్యా ప్యాసింజర్ రైళ్లను పెంచాలని కోరామని, రైళ్లలో వృద్ధులకు రాయితీ పునరుద్ధరించాలని కోరినట్లు ఎంపీ అంబికా లక్ష్మి నారాయణ వెల్లడించారు.

# సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం: సీఎం చంద్రబాబు



అమరావతి: తిరుమల లడ్డూ కల్తీ ఘటనకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు సీబీఐ, ఏపీ పోలీసులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేయడానికి ఆదేశించిన సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. సత్యమేవ జయతే, ఓం నమో వేంకటేశాయ" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 5 మంది సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. సిట్‌లో సీబీఐ నుంచి ఇద్దరు అధికారులు, ఏపీ ప్రభుత్వం నుంచి ఇద్దరు పోలీసు అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒక సీనియర్ అధికారి ఉండాలని పేర్కొంది. సిట్ దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని తీర్పు వెలువరించింది.

# ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు.. గాయత్రి దేవి అలంకారంలో దుర్గమ్మ



విజయవాడ: ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు గాయత్రీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిస్తున్నారు. పంచముఖాలతో గాయత్రిదేవి సంధ్యావందన అధిష్టాన దేవతగా అమ్మవారిని కొలుస్తారు. కొబ్బరి అన్నాన్ని నివేదనగా సమర్పిస్తారు. సకల మంత్రాలకు, వేదాలకు మూలమైన దేవతగా గాయత్రీదేవి ప్రసిద్ధి. మహత్తర శక్తిగల జగన్మాత ఐదు ముఖాలతో వరదాభయ హస్తాలు ధరించి కమలాసనాసీనురాలిగా దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. దీంతో కోలాహలం నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం, ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

శుక్రవారం దుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరినాథ్, జస్టిస్ దుర్గాప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), సీపీ రాజశేఖర్‌బాబు తదితరులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

# అధికారం వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయి.. షర్మిల విసుర్లు



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం పెద్ద జోక్ అని విమర్శించారు. అధికారం వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎంగా అన్నివర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇవాళ(శుక్రవారం) షర్మిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... అన్ని మతాలను పవన్ కళ్యాణ్ సమానంగా చూడాలని కోరారు. ఒక మతానికే ప్రతినిధిగా పవన్ వ్యవహరిస్తున్నారని వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఆ వేషం వేసుకుని హిందూ మతం గురించి మాట్లాడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ చర్యల వల్ల ఇతర మతాలను ఆచరించే వారిలో అభద్రతా భావం ఏర్పడదా అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డైరెక్షన్‌లో పవన్ కళ్యాణ్ యాక్ట్ చేస్తున్నారని విమర్శలు చేశారు. ఆర్.యస్.యస్ భావజాలం బీజేపీ పాటిస్తుందని వైఎస్ షర్మిల ఆరోపించారు. జనసేన సెక్యులర్ పార్టీ అనుకున్నామని.. కానీ పవన్ కూడా ఆర్.యస్.యస్ సిద్ధాంతంతో వెళ్తున్నారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై ఊచకోత కోస్తే పవన్ ఎందుకు మాట్లాడరని వైఎస్ షర్మిల అడిగారు. ఇతర మతాల వారు ఓట్లు వేస్తేనే పవన్ గెలిచారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇప్పుడు ఒకే మతం అంటున్న పవన్‌ను ఇతర మతాల వారు ఆదరిస్తారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ యాత్ర చేశారని గుర్తు చేశారు. అటువంటి నేతను... పవన్ కళ్యాణ్ విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాయ నుంచి పవన్ కళ్యాణ్ బయటకురావాలని వైఎస్ షర్మిల హితవు పలికారు.

# సుప్రీంకోర్టు తీర్పును జగన్ వక్రీకరించారు: మంత్రి పయ్యావుల కేశవ్



అమరావతి: జగన్ అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తిరుమల ప్రాశస్త్యం గురించి గతంలో ఎప్పుడైనా జగన్ మాట్లాడారా? నెయ్యి టెండర్ల విధానాన్ని సర్వనాశనం చేశారు. వైకాపా పాలనలో తిరుమల అపవిత్రమైంది. డిక్లరేషన్ ఇవ్వాల్సి వస్తుందని కొండకు వెళ్లని వ్యక్తి జగన్. వెంకన్నను నమ్ముతున్నానని ఒక్కమాట కూడా చెప్పలేదు. తిరుమలలో అద్భుతమైన వ్యవస్థను కాపాడాలా? తిరుమల వెళ్లేందుకు బద్ధకించి ఇంట్లోనే ఆలయం సెట్ వేశారు. సుప్రీం ఆదేశాలను వక్రీకరించగల సమర్థుడు జగన్. తీర్పు కాపీ రాకముందే ప్రెస్‌మీట్ పెట్టి వక్రీకరించారు. జగన్ చెప్పేవన్నీ జనం నమ్ముతారనుకోవడం ఆయన భ్రమ. విచారణ పూర్తయితే దోషులు బయటకు వస్తారు" అని కేశవ్ అన్నారు.





# తిరుమల లడ్డూ వివాదం- సుప్రీంకోర్టు తీర్పుపై మంత్రుల రియాక్షన్ ఇదే..

అమరావతి: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఏపీకి చెందిన పలువురు మంత్రులు స్పందించారు. ఈ అంశంలో సుప్రీం ఇచ్చిన తీర్పును స్వగతిస్తున్నట్లు మంత్రులు వంగలపూడి అనిత, పొంగూరు నారాయణ, కొల్లు రవీంద్ర చెప్పారు. సుప్రీం తీర్పు ప్రకారం లడ్డూ కల్తీపై స్వతంత్ర సిట్ ఏర్పాటు చేసి నిజానిజాలు నిగ్గు తేల్చనున్నట్లు మంత్రులు తెలిపారు. తిరుమల లడ్డూ వివాదంపై ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సిట్‌లో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరఫున ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు సభ్యులుగా ఉండాలని సూచించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో హోంమంత్రి మాట్లాడారు. శ్రీవారి లడ్డూ అనేది భక్తుల మనోభావాలకు సంబంధించిన ముఖ్యమైన అంశమని అనిత అన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సిట్ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని చెప్పుకొచ్చారు. సిట్ ఏర్పాటుతో స్వామివారి భక్తులు, ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని ఆమె అన్నారు. తప్పు చేయనివారు భయపడరని, విజిలెన్స్ ఎంక్వైరీ అంటే వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి ఎందుకు భయపడుతున్నారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. సిట్ ద్వారా త్వరలో నిజానిజాలు బయటపడతాయని, స్వామివారికి అపచారం చేసిన వారు ఎవరైనా సరే జైలుకు వెళ్లడం ఖాయమని హోంమంత్రి అనిత అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు ఏపీ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని మంత్రి కొల్లు అన్నారు. ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. వినాయకుడి గుడి వద్ద నంచి క్యూ లైన్‌లో నడిచి తాను కొండపైకి చేరినట్లు మంత్రి చెప్పారు. గత ఐదేళ్లపాటు మహోత్సవాలను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని రవీంద్ర మండిపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం దేవాలయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందుకే ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. లక్షల మంది భక్తులు వస్తున్నా ఎలాంటి ఆటంకం లేకుండా అమ్మవారి దర్శనం జరుగుతోందని మంత్రి చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కొల్లు రవీంద్ర చెప్పుకొచ్చారు. మరోవైపు నెల్లూరు నగర కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులతో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. నగరంలో అపరిష్కృత సమస్యలపై దృష్టి సారించాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "నెల్లూరు నగరంలో సమస్యలున్న ప్రాంతాలను ఒక్కొకటిగా పర్యటిస్తున్నా. నగరంలో కొన్ని రోడ్ల మరమ్మత్తులకు పది రోజుల్లో టెండర్లు పిలిచి పనులకు ఆదేశిస్తాం. కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్య ఆరు నెలల్లో పరిష్కరించాలని ఆదేశించా. పార్కులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. వాటిని పునరుద్ధరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. నగరంలో గ్రీనరి డెవలప్మెంట్ కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చే వాళ్లను స్వాగతిస్తున్నాం. నెల్లూరులో ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ సమస్య ఉంది. తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. లడ్డూ వివాదం కోర్టు పరిధిలో ఉన్నందు వల్ల కూటమి నేతలు బహిరంగ వ్యాఖ్యలు చేయ్యొద్దని కోరుతున్నా" అని చెప్పారు.

# దర్యాప్తునకు సహకరించాలి.. సజ్జలకు హైకోర్టు ఆదేశం



అమరావతి: మంగళగిరిలోని తెదేపా కార్యాలయంపై మూకుమ్మడి దాడి కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ వైకాపా నేత, గత ప్రభుత్వంలో ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ధర్మాసనం.. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తునకు సహకరించాలని సజ్జలను హైకోర్టు ఆదేశించింది. ప్రధాన బెయిల్‌పై విచారణ ఈ నెల 25కి వాయిదా పడింది. "తెదేపా కార్యాలయంపై దాడి ఘటనలో నాకు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ కేసులో సహ నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా నన్ను 120వ నిందితుడిగా చేర్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక వైకాపా నేతలు, కార్యకర్తలను వేధిస్తున్నారు. అదే క్రమంలో నాపైనా కేసు పెట్టారు. సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ నోటీసు నిబంధల ప్రకారం నేను రక్షణ పొందకుండా అడ్డుకునేందుకే, హత్యాయత్నం సెక్షన్‌ను చేర్చారు. నేను అమాయకుడిని. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటాను. ముందస్తు బెయిలు మంజూరు చేయండి" అని పిటిషన్‌లో సజ్జల పేర్కొన్నారు.

# తప్పు చేసిన ఏ ఒక్కరినీ ఆ దేవదేవుడు వదిలిపెట్టడు.. జగన్‌కు సోమిరెడ్డి మాస్ వార్నింగ్



నెల్లూరు : జగన్ ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్ అక్రమాలు భారీగా జరిగాయని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. కోట్ల రూపాయల అవినీతికి అప్పటి వైసీపీ ప్రభుత్వం పాల్పడిందని ఆరోపణలు చేశారు. ఇవాళ(శుక్రవారం) నెల్లూరు జిల్లాలోని టీడీపీ కార్యాలయంలో సోమిరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ... సూరాయపాలెంలో రూ. 54 కోట్లు, విరువూరులో రూ. 37 కోట్లు పెనాల్టీని మైన్స్ శాఖ వేసిందని గుర్తుచేశారు. రైతుల పేరుతో అనుమతులు తెచ్చి గ్రావెల్‌ని లక్షల క్యూబిక్ మీటర్లు తవ్వేశారని ఆరోపించారు. అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కనుసన్నల్లో మొత్తం అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రధాన దోపిడీదారుడు కాకాణి గోవర్ధన్ రెడ్డికి మైనింగ్ అధికారులు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు.. మైనింగ్ అధికారులు ఎందుకు విచారణ చేయడం లేదు... ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. కరోనా హౌస్‌లో కూర్చుని సర్వేపల్లిని దోచుకున్న వ్యక్తి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని విమర్శించారు. ప్రస్తుతం వచ్చిన రూ. 106 కోట్ల అవినీతి 10శాతం మాత్రమే... ఇంకా 90 శాతం అవినీతి బయటపడాలని అన్నారు.. ఐదేళ్ల అక్రమ ఇసుక, గ్రావెల్, సిలికా, క్వార్ట్జ్ అక్రమాలపై విచారణ జరగాలని చెప్పారు.. ఈ భారీ దోపిడీలో లోటస్ పాండ్‌కి వాటా పోయింది... సజ్జల రామకృష్ణారెడ్డికి వాటా పంపారని ఆరోపించారు. అక్రమంగా ప్రజల సొత్తు దోచేసిన కాకాణిని కటకటాల వెనక్కి పంపిస్తామని హెచ్చరించారు. సుప్రీం కోర్టు తీర్పుని స్వాగతిస్తున్నామని అన్నారు.. తప్పు చేసిన ఏ ఒక్కరినీ ఆ దేవదేవుడు వదిలిపెట్టడని హెచ్చరించారు. లడ్డూ వ్యవహారంలో ఖచ్చితంగా మంచి విచారణ జరగాలని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కరుకున్నారు.

# కల్తీ జరగలేదు.. న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నాం

న్యూఢిల్లీ4: టీటీడీ లడ్డూ విషయంలో గత ప్రభుత్వంలో అవకతవకలు జరిగాయని మాట్లాడారని.. సీబీఐ విచారణతో న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నామని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. లడ్డూ వివాదంపై ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. లడ్డూ విషయంలో పొలిటికల్ కామెంట్ చేయొద్దని సుప్రీం కోర్టు చెప్పిందన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో నిజాలు బయటపెట్టేలా విచారణ జరిపించాలని పిటిషన్ వేయడం జరిగిందన్నారు. ఆరోపణలు నిజమైతే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని చెప్పామన్నారు. తన హయాంలో ఏఆర్ కంపనీ నుంచి ఎప్పుడూ నెయ్యి సరఫరా జరగలేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో టెండర్ ఆమోదించారన్నారు. కల్తీ జరిగితే ఎలాంటి పదార్థాలు కలిశాయి అన్నది కూడా తెలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నింద వేసింది కాబట్టి ఇక వెనక్కి వెళ్లొద్దన్న ధోరణిలో మాట్లాడుతున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. విచారణ ముగిసే వరకు సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంటుందన్నారు. "మాపై చేసిన నిందలు తొలగిపోతాయని అనుకుంటున్నాము. మా సమయంలో కల్తీ జరగలేదు. లడ్డూలను ఇంత వరకు టెస్ట్ చేయలేదు" అని వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు.

**వాస్తవాలు బయటకొస్తాయ్: భూమన...** సీబీఐ సిట్ బృందం విచారణను పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. తిరుమల లడ్డూపై కేవలం దురుద్దేశపూర్వక ఆరోపణలు చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ ఏవిధంగా న్యాయం చేయదు అనేది తమ భావనన్నారు. సీఎం చంద్రబాబు చెప్పిన తర్వాత ఆయన నియమించిన సిట్ ఏ విధంగా అయినా నిర్దోషులను దోషులుగా నిలబెట్టే ప్రయత్నం జరిగేదని విమర్శించారు. ఈరోజు సుప్రీం కోర్టు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఇవ్వడంతో తమకు నమ్మకం ఏర్పడిందన్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి ఆదేశాలతోనే సుప్రీం కోర్టు ద్వారా ఆదేశాలు వచ్చాయన్నారు. సీబీఐ విచారణ ద్వారా నిజాలు నిగ్గు తేలుతాయని.. సత్యం వెలుగులోకి వస్తుందన్నారు. తన ఆలయ ప్రతిష్ఠ భంగం కలిగించే వారిపై స్వామివారి చర్యలు ఉంటాయని భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు.

# బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు బెయిల్



అమరావతి, అక్టోబర్ 4: బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు హైకోర్టులో ఊరట లభించింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో బాపట్ల మాజీ ఎంపీకి హైకోర్టు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. సురేష్‌కు షరతులతో కూడిన బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. అయితే మాజీ ఎంపీ సురేష్‌పై ఉన్న హత్య కేసుపై తుళ్లూరు పోలీసులు పీటీ వారెంట్‌ను దాఖలు చేశారు. తుళ్ళూరు పోలీసులు వేసిన పీటీ వారెంట్‌కు ట్రయల్ కోర్టు అనుమతించింది. కాగా.. టీడీపీ పార్టీ కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి గత నెలలో నందిగం సురేష్ హైదరాబాద్‌లో అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఈ దాడికి సంబంధించి కేసు నమోదు అయిన నేపథ్యంలో కొన్ని రోజులుగా మాజీ ఎంపీ కోసం వెతికిన పోలీసులు చివరకు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని గుంటూరు జిల్లాకు తరలించారు.

# అను ఇమ్మాన్యుయేల్.. లెగ్స్ అందంతో స్టన్నింగ్

క్యూట్ యాక్ట్రెస్‌గా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకున్న అను ఇమ్మాన్యుయేల్ అప్పుడప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారుతోంది. ఇక లేటెస్ట్ ఇన్స్టాగ్రామ్ పోస్టుతో మరోసారి వైరల్ గా మారింది. అమ్మడు అందంతో కూడా ఆకట్టుకుంది. అక్టోబర్ 1వ తేదీని ఆమె “Hello October” అంటూ చేసిన పోస్ట్ అభిమానులను కట్టిపడేస్తోంది. ఫోటోల్లో ఆమె స్టైలిష్ లుక్, కూల్ బూట్స్ తో కాంబినేషన్ సూపర్ గా ఉందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. అను తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో పాటు ఫ్యాషన్ సెన్స్ కూడా మరోసారి ప్రదర్శించింది. ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఆమె అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి రేకెత్తిస్తోంది. గత కొంతకాలంగా సినిమాల



పరంగా పెద్దగా కనిపించకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం తన అందం, స్టైల్‌తో అలరిస్తూనే ఉంది అను. ఈ ఫోటోలలో ఆమె సింపుల్‌గా ఉన్నా, ఆమె వ్యక్తిత్వం, స్టైల్ మాత్రం మరింత ప్రత్యేకంగా నిలిచాయి. సెటిన్ చైర్ మీద కూర్చొని నిశ్చింతగా ఆలోచనల్లో ఉన్నట్లు కనిపించడం, ఆమెను ఫ్యాషన్ ఐకాన్‌గా నిలబెట్టేలా ఉంది. ఇక ఆమె కెరీర్ విషయానికి తెలుగులో పలు సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి. ఆమెకు మొదటి బ్రేక్ 2016లో వచ్చిన ‘మజ్ను’ మూవీతో వచ్చింది. ఆ తర్వాత ‘కిట్టు ఉనాడు జాగ్రత్త’, ‘నా పేరు సూర్య’, ‘అజ్ఞాతవాసి’ వంటి చిత్రాలలో భిన్నమైన నటనతో ఆకట్టుకుంది. అయితే, గత కొన్నేళ్లుగా పెద్దగా విజయాలు సాధించకపోయినా, అను తనకంటూ ఒక ఫ్యాన్ బేస్ ను ఏర్పరుచుకున్నారు. సినిమాల్లో తగ్గిన అవకాశాలను స్మార్ట్ గా హ్యాండిల్ చేస్తూ, సోషల్ మీడియా ద్వారా తన స్టైలిష్ లుక్స్ తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె కొన్ని ఆసక్తికర ప్రాజెక్ట్స్ పై పనిచేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా తమిళంలో అమ్మడు ఒక లేడి ఓరియెంటెడ్ వెబ్ సీరీస్ చేస్తున్నట్లు ఆ మధ్య టాక్ వచ్చింది. మరి ఆ ప్రాజెక్టు ఎప్పుడు రిలీజ్ అవుతుందో చూడాలి.

# క్యూట్ లుక్ లో కాక పుట్టించేలా!

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హాట్ అప్పిరియన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు బాలీవుడ్ కి వెళ్లిన నాటి నుంచి తన లో కొత్త యాంగిల్ ని బయటకు తీసింది. అక్కడ కల్చర్ కి తగ్గట్టు మూవ్ అవుతుంది. నార్త్ భామల నుంచి పోటీని తట్టుకుని మార్కెట్ లో నిలబడాలంటే ఆమాత్రం తప్పనిసరి. అలా చేయగల్గింది కాబట్టి నేడు సల్మాన్ ఖాన్ తో ఛాన్స్ అందుకుంది. స్టార్స్ చిత్రాల్లో భాగమవుతుంది. అప్పటి నుంచి సోషల్ మీడియా యాక్టివిటీని మరింత స్పీడప్ చేసింది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో ట్రెండ్ కి తెర తీస్తుంది. తాజాగా అమ్మడు క్యూట్ లుక్ ఫోటోలు కొన్ని షేర్ చేసింది. జర్నీ చేస్తూ క్యాబిన్ నుంచి ఫోటోలు పంచుకుంది. ఇందులో అమ్మడు తన మార్క్ చేష్టలతో అలరించింది. రెండు చేతుల వేళ్లను కలిపి లవ్



సింబల్ చేసింది. ముఖం నుంచి రకరకాల హావభావాలు ఒలికించింది. పెదాలకు లిప్ స్టిక్ తప్ప పెద్దగా మ్యాకప్ వేసుకోలేదు. నేచురల్ బ్యూటీతోనే కనిపిస్తుంది. అమ్మడు పాల నురుగుల సౌందర్యంతో తళతళలాడిపోతుంది. ఫోటోలన్ని క్యూట్ గా ఉన్నాయి. ప్రస్తుతం ఈ పిక్స్ అంతర్జాలంలో వైరల్ గా మారాయి. దీంతో కామెంట్ బాక్స్ లో పోస్టులు అంతే ఇంట్రెస్టింగ్. ఎవరి స్టైల్లో వారు ప్రపోజ్ చేస్తున్నారు. ఇక రష్మిక డిసెంబర్ లో %-%పుష్ప-2%-% తో రచ్చ చేయడానికి రెడీ అవుతుంది. రిలీజ్ కి కోసం తాను కూడా ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తుంది. ఈ సినిమా ప్రచారం ప్రారంభమైతన తర్వాత రష్మిక ఎలాంటి టెక్నిక్ లతో ఎంగేజ్ చేస్తుందని ఓ సెక్షన్ ఆడియన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




# అప్పుడలా..ఇప్పుడిలా....డిసెంబర్ ఇలా!



సంక్రాంతి రిలీజ్ లు అనంతరం సరైన రిలీజ్ లు లేక థియేటర్లు ఎలా వెల వెల బోయాయో తెలిసిందే. సమ్మర్ అయితే ఏకంగా థియేటర్లనీ తాత్కాలికింగా మూసి వేయాల్సి వచ్చింది. నిర్మాతలొచ్చి మా సినిమా ల కోసం తెరవండి అని చెప్పే వరకూ కూడా థియేటర్లు తెరుచుకున్న పరిస్థితి లేదు. హనుమాన్’, ‘డీజే టిల్లు, కల్కి 2898, కమిటీ కుర్రాళ్లు, ఆయ్, సరిపోదా శనివారం, మత్తు వదలరా-2 లాంటి హిట్ సినిమాలు మాత్రమే ఉన్నాయి. ఇవన్నీ ఒకేసారి రిలీజ్ అయినవి కాదు. ఈ తొమ్మిది నెలల కాలంలో ఒక్కో ఫేజ్ లో ఒక్కో చిత్రం చొప్పున రిలీజ్ అయ్యాయి. అలా కాస్తా కూస్తో థియేటర్లు ఆ రిలీజ్ లు కారణంగా కళకళలాడాయి. మళ్లీ ఇప్పుడు దేవర, సత్యం సుందరం లాంటి హిట్ సినిమాల కారణంగా థియేటర్లు కళకళలాడుతున్నాయి. అన్నింటిని మించి ఎన్టీఆర్ దేవర,కల్కి 2898 లాంటి రిలీజ్ లతో థియేటర్లకు కళ తోడైనట్లు ఉంది. చిన్న సినిమాలు హిట్ టాక్ తెచ్చుకున్నా? అవి ఏదో రూపంలో పైరసీ అవ్వడంతో? వాటికి ఆదరణ తగ్గుతుంది. వాటి కోసం జనాలు థియేటర్ వైపుకు మళ్లకపోవడం అది ప్రధాన కారణంగా చెప్పొచ్చు. తాజాగా ఇప్పుడు ఇద్దరు అగ్ర హీరోలు రిలీజ్ కి రెడీ అవుతున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తోన్న పుష్ప-2 డిసెంబర్ 6న భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. ఇక మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న గేమ్ ఛేంజర్ కూడా డిసెంబర్ 20న రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాల మధ్య కాస్త పోటీ ఉండొచ్చు. రెండు వారాలు గ్యాప్ ఉన్నా? ఇద్దరు అగ్ర హీరోలు కాబట్టి కొంత పోటీ ఉంటుంది. వసూళ్ల పరంగా కొంత వ్యత్యాసం ఉంటుంది.

# రజినీకాంత్ వేట్టయన్ ట్రైలర్.. ఎలా ఉందంటే?




కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్.. వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు వేట్టయన్- ద హంటర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జై భీమ్ ఫేమ్ టీజీ జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై సుభాస్కర్ నిర్మిస్తున్నారు. సోషల్ డ్రామా జోనర్ లో సినిమాలు తీయడంలో జ్ఞానవేల్ దిట్ట కావడంతో.. వేట్టయన్ మూవీపై ఆడియన్స్ తో పాటు సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో దసరా సందర్భంగా అక్టోబర్ 10వ తేదీన వేట్టయన్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. అయితే ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్స్, టీజర్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. అదే జోష్ తో నేడు సినిమా ట్రైలర్ ను రిలీజ్ చేశారు. హంటర్ వాంతర్ చూడు డా! హంటింగ్ మొదలైంది అంటూ అదిరిపోయే క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం వేట్టయన్ ట్రైలర్.. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతుంది. అందరినీ ఆకట్టుకుని అలరిస్తోంది. ఒక్క అమ్మాయి హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేయాలంటూ ప్రజల నినాదాలతో ట్రైలర్ ప్రారంభమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగుతారు. నేరస్థుడిని పట్టుకోలేకపోతారు. క్లూ కూడా కనిపెట్టలేకపోతారు. వారంలో ఎన్ కౌంటర్ జరిగిపోవాలని పోలీస్ అధికారి (రావు రమేష్) చెబుతారు. అప్పుడే ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ గా ఎంట్రీ ఇస్తారు రజినీ కాంత్. అక్కర్లేదు సర్.. వారం రోజులు అక్కర్లేదు సర్.. మూడే మూడు రోజుల్లో డిపార్ట్మెంట్ కు మంచి పేరు వస్తుందని చెబుతారు. ఆ తర్వాత అమితాబ్ బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, దూషారా విజయన్ ను పరిచయం చేశారు మేకర్స్. అయితే క్రైమ్ క్యాన్సర్ లాంటిదని.. దానిని పెరగనివ్వకూడదని రజినీ మిగతా పోలీసులతో చర్చిస్తారు. ఊరికే మాట్లాడి ప్రయోజనం లేదు. వాడిని వెంటనే లేపేద్దామంటూ టీమ్ ను రెడీ చేస్తారు. మరి చివరగా రజినీకాంత్ టీమ్.. హత్య కేసులో నిందితుడిని ఎన్ కౌంటర్ చేశారా లేదా అన్నది మిగతా సినిమాగా తెలుస్తోంది. అయితే ట్రైలర్.. ఆకట్టుకుంటా సినిమాపై అంచనాలు పెంచుతోంది. ట్రైలర్ లో రజినీకాంత్ మార్క్ డైలాగ్స్, స్టైల్, యాక్షన్.. సూపర్ గా ఉన్నాయి. స్టార్ క్యాస్టింగ్ ను దింపిన మేకర్స్.. అందరికీ సరైన స్కోప్ ఉన్న రోల్స్ ఇచ్చినట్లు అర్థమవుతుంది. జ్ఞానవేల్ మార్క్ క్లియర్ గా కనిపించింది. అనిరుధ్ రవిచందర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. మరి రజినీకాంత్ వేట్టయన్ మూవీ.. ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి. అయితే మీరు ట్రైలర్ ను చూశారా? లేదా?

# పూల్ సైడ్ నటాషా ఒంపుల్ సొంపుల్

పూల్ సైడ్ పార్టీల్లో చెలరేగిపోవడం నటాషా స్టాంకోవిక్ కి కొత్తేమీ కాదు. హార్ధిక్ పాండ్యాతో ప్రేమాయణానికి ముందు ఈ బ్యూటీ హిందీ చిత్రసీమ, బుల్లితెర అనుబంధంతో అప్పట్లోనే రెచ్చిపోయేది. ఇక పెళ్లి తర్వాత నటాషా స్టాంకోవిక్ కొంత ప్రయివేట్ లైఫ్ ని స్తబ్ధుగా గడిపేసింది కానీ, ఇప్పుడు మరోసారి తిరిగి చెలరేగిపోతోందని తాజాగా విడుదలైన సోషల్ మీడియా ఫోటోలు వీడియోలు చెబుతున్నాయి. తాజాగా పూల్ సైడ్ ట్రీట్ కి సంబంధించిన ఫోటోలు, వీడియోలు అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. హార్ధిక్ పాండ్యా నుంచి విడిపోయిన తర్వాత నటాషా పూర్తిగా క్రైసిస్ లో పడిందన్న వాదనకు



ఇది చెక్ పెడుతోంది. నటాషా ఫుల్ స్వింగ్ లో ఉంది. పూర్తిగా చిల్లింగ్ గా కనిపించింది. ఒంటరిగా ఉన్నా కానీ, తన ప్రయివేట్ లైఫ్ ని నచ్చినట్టు ఎంజాయ్ చేస్తోంది. ప్రస్తుతం నటాషా పూల్ సైడ్ ట్రీట్ కి సంబంధించిన ప్రత్యేక ఫోటోలను యువతరం అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. నటాషా ఒంపు సొంపుల విందు కళ్ల ముందు సాక్ష్యాత్కరించగా, దీనిపై అభిమానుల నుంచి ఘాటైన కామెంట్లు వచ్చి పడుతున్నాయ్. నటాషా టూ హాట్ గా ఉందంటూ పలువురు కామెంట్ చేస్తున్నారు. క్రికెటర్ హార్ధిక్ పాండ్యా నుంచి విడిపోయిన నటాషా, ఇటీవలే వారి కుమారుడు అగస్త్యను హార్ధిక్ చెంత విడిచి వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి బీచ్ సైడ్ వెకేషన్ ని నటాషా ఒక రేంజులో ఎంజాయ్ చేస్తోంది.

# మాల్దీవ్స్‌లో ‘పారి’జాతం

పారి అలియాస్ పరిణీతి చోప్రా రాజకీయ నాయకుడు రాఘవ్ చద్దాను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత ఈ జంట గోల్స్ ఇతరుల్లో స్ఫూర్తిని నింపుతున్నాయి. నిరంతరం ఒకరితో ఒకరుగా ప్రేమైక ఆనందంలో ఉన్న ఫోటోలు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి. తాజాగా మాల్దీవుల నుంచి స్పెషల్ ఫోటో ఆల్బమ్ విడుదలైంది. పరిణీతి చోప్రా- రాఘవ్ చద్దా తమ మొదటి వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి మాల్దీవులకు వెళ్లారు. మంగళవారం పరిణీతి తమ వెకేషన్ నుండి రాఘవ్ పాస్‌పోర్ట్ ఫ్లెక్స్, సుందరమైన ప్రదేశాలను షేర్ చేసింది. అందమైన రిసార్ట్, అందమైన అబ్బాయి.. నేను... అద్భుతమైన 48 గంటల వేకే కోసం జోయాలీకి ధన్యవాదాలు! అని రాసింది పరిణీతి. బీచ్‌లో సూర్యుడి ఎండలో... సైకిళ్లు తొక్కుతూ ... మిర్రర్ సెల్ఫీ లతో ఒకటే సందడి చేసారు ఇద్దరూ. పరిణీతి తన రిసార్ట్‌లో ఆస్వాదించిన రుచికరమైన ఆహారాన్ని.. మసాజ్ రూమ్ నుండి దృశ్యాన్ని కూడా ఫోటోలు వీడియోలతో డాక్యుమెంట్ చేసింది. పరిణీతి షేర్ చేసిన ఫోటోలలో పారితో పాటు



రాఘవ్ పాస్‌పోర్ట్ ఉంది. పారీ భారతీయులందరిలాగే సాధారణ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండగా.. రాజ్యసభ ఎంపీ అయిన రాఘవ్‌కి దౌత్య పరమైన పాస్‌పోర్ట్ ఉంది. అటువంటి పాస్‌పోర్ట్‌లు దౌత్య హోదా కలిగిన వ్యక్తులకు లేదా విదేశాలలో అధికారిక విధుల కోసం భారత ప్రభుత్వంచే నియమితులవుతారు. ఇది విదేశాల్లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ప్రభుత్వ అధికారులకు వేగవంతమైన ప్రయాణం, దౌత్యపరమైన శక్తి , వీసా ప్రయోజనాలను కలిగి ఉండవచ్చు.

**మొదటి వార్షికోత్సవం :** పరిణీతి- రాఘవ్ తమ మొదటి వివాహ వార్షికోత్సవాన్ని మాల్దీవులలోని తెల్లటి ఇసుక బీచ్‌లు నీలం సముద్రం మధ్య ప్రశాంతమైన వెకేషన్ ని ఆనందించారు. అంతకుముందు ద్వీప దేశంలో ఈ జంట బీచ్ ఒడ్డున కూర్చుని పానీయాలు ఆస్వాధిస్తున్న ఫోటోని, సూర్యాస్తమయాన్ని ఆస్వాధించిన మరొక ఫోటోని షేర్ చేసారు. గత సంవత్సరం సెప్టెంబర్ 24 న పరిణీతి చోప్రా- రాఘవ్ చద్దా ఉదయపూర్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. ఈ వేడుక లీలా ప్యాలెస్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.

